Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

మైత్రి డెంటల్ క్లినిక్
• పిప్పిపళ్లకు మరియు విరిగిన పళ్లకు అత్యాధునిక లేజర్‌చికిత్స.
• ఎత్తుపళ్లు, వంకరటింకర పళ్లను సరిచేయు చికిత్స.
• పళ్లు ఊడిపోయిన వారికి కృత్రిమ దంతాలు అమర్చుట.
డా॥ ఎ. నరేంద్రనాథ్, BDS డెంటల్ సర్జన్
డా॥ శ్రీమతి ఎ. సునీత, BDS డెంటల్ సర్జన్
వెంకటరమణ థియేటర్ ఎదురుగా, దర్గామిట్ట, నెల్లూరు.
ఫోన్: 2341840, 9989100887

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి
Longest Living Newspaper in Telugu Journalism
ప్రజాభీమా
సంపుటి: 82 • సంచిక: 1 • 6-1-2012 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-


a ★★★ hotel with 5 star comforts
D.R. UTTHAMA HOTEL
Winner of Excellence Award 2004, 2005 & 2006
G.T.Road, Nellore - 524 003.(A.P)
Ph: 0861 - 2317777
email - drutthama@yahoo.co.in

కొమ్మనేటూరు యువతి చావులో కాంగ్రెస్ నేత ప్రమేయం

గూడూరు మండలం కొమ్మనేటూరు గ్రామంలో ఒక యువతి అనుమానాస్పద చావు రాజకీయ సంచలనం సృష్టిస్తున్నది. ఆ యువతి మరణం మద్రాసులో జరిగింది. ఆమె తల్లి, తండ్రి కురుగొండ గ్రామానికి చెందిన వారు. మద్రాసులో స్థిరపడ్డారు. ఆమె తల్లితో జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ ప్రముఖుడికి సంబంధబాంధవ్యాలున్నాయట. ఆయన మద్రాసుకు వెళ్లినప్పుడల్లా వారి ఇంట్లోనే మకాం పెడుతూ ఉంటాడట. ఈ మరణం సంభవించిన రోజు కూడా ఆయన తన స్నేహితులతో కలిసి ఆ ఇంట్లో ఉన్నాడని వినికిడి. ఏ కారణం వల్లనో ఆ యువతి మరణించింది. ఆమె తల్లితండ్రులు, తమ కుమార్తె ఉరిపోసుకొని చనిపోయిందని చెప్తున్నారట. అది ఆత్మహత్య అయితే, స్థానిక పోలీస్‌కు సమాచారం ఇచ్చి, పోస్ట్‌మార్టం జరిపించి ఉండాలి. కానీ అవేవీ జరగలేదు. ఒక ప్రైవేట్ కారులో ఆ యువతి శవాన్ని రాత్రి సమయంలో కొమ్మనేటూరుకు తరలించారు. అక్కడ హడావుడిగా దహన సంస్కారాలు జరిపించారు. గ్రామస్తులు కొందరు ఆ శవం మెడమీద గాయం ఉండడం చూసి వారిని ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పకుండా దాటవేసి, దహన కార్యక్రమం పూర్తి చేశారట. దానితో ఈ చావు వెనుక ఏదో మిస్టరీ ఉం

కొరవ 14వ పేజీలో

జగన్ అరెస్ట్ ఖాయం?

విజయసాయిరెడ్డి అరెస్ట్ జగన్ శిబిరంలో కలవరం సృష్టిస్తున్నది. భయకంపనలు కల్గిస్తున్నది. జగన్ అక్రమ ఆస్తుల కేసులో విజయసాయిరెడ్డి రెండవ ముద్దాయి. జగన్ మొదటి ముద్దాయి. రెండవ వాడిని చెరపట్టినప్పుడు మొదటి వాడిని వదలి పెడతారని భావించలేము. ఈ రోజు కాకుంటే రేపైనా జగన్ అరెస్ట్ ఖాయమన్న అనుమానాన్ని విజయసాయిరెడ్డి అరెస్ట్ ధృవపరచింది. గత ఆగష్టు నెల నుంచి ఈ పరిస్థితి ఏర్పడకుండా నిరోధించడానికి జగన్ చాలా ప్రయత్నమే చేశాడు. ప్రధానమంత్రిని కలిసి నా మీద విచారణ అంటే వైఎస్ మీద జరిగినట్లే కాబట్టి పునరాలోచన చేయమని విజ్ఞప్తి చేశాడు. ఫరూఖ్ అబ్దుల్లా, శరద్ పవార్ వంటి మిత్రపక్షాల నేతలతో రాయబారాలు నడిపాడు. జగన్ పినతండ్రి వైవి సుబ్బారెడ్డి జైపాల్ రెడ్డి, అహ్మద్ పటేల్ వంటి కాంగ్రెస్ ముఖ్యులను పలుమార్లు కలిసి రాయబేరాలు చేశాడు. ఒక్క వారం క్రింద విజయవాడ ఎమ్పీ లగడపాటి రాజగోపాల్, జగన్‌ల మధ్య రహస్య సమావేశం నడిచిందని వినికిడి. నువ్వు కాంగ్రెస్‌లో తిరిగి చేరితే సమస్యలు తప్పించే ప్రయత్నం చేస్తానని బేరం పెట్టాడట రాజగోపాల్. కానీ ఈ సంధి ప్రయత్నాలేవీ సఫలం కాలేదు. మరొక ప్రక్క న్యాయపరంగా సిబిఐ దర్యాప్తును అడ్డుకోవడానికి అండపిండ బ్రహ్మాండమంత ప్రయత్నం చేశాడు జగన్. మన హైకోర్టు, ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టులలో పలు రకాల వ్యాజ్యాలు

కొరవ 14వ పేజీలో


ప్రథమవర్థంతి
మానవతామూర్తి, సహృదయులు మా అన్నగారైన
శ్రీ కాకాణి వేణుగోపాల్‌రెడ్డి గారు
స్వర్గస్తులై 11-01-2012 బుధవారం నాటికి సంవత్సరం నిండుతుంది. ప్రథమవర్థంతి సందర్భంగా వారి పవిత్ర ఆత్మకు శాంతిని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తూ..
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.
తమ్ముడు : కాకాణి పాండు రంగారెడ్డి
తమ్ముని కుమారుడు : వెంకటేశ్వరప్రసాద్‌రెడ్డి
మనుమడు : అభినయ్‌రెడ్డి మరియు కుటుంబ సభ్యులు
శ్రీ కాకాణి వేణుగోపాల్‌రెడ్డి గారు
జననం: 1919 మరణం: 2011
ప్రథమవర్థంతి సందర్భముగా ఉడ్‌కాంప్లెక్స్‌లోని ప్రగతి ఛారిటీస్ నందు "అన్నదాన" కార్యక్రమం జరుగును.


చతుర్థ వర్థంతి
మన్నించే గుణం కలిగిన మనుషులు
భూమి మీద ఎక్కువ కాలం జీవిస్తారంటారు.
మరి మేము మీకు మన్నించలేనంత తప్పు ఎవ్వరు చేశారని
నాకు నా బిడ్డలకు ద్రోహం చేసి మళ్లి మమ్ములను చూడలేనంత
దూరంగా వెళ్లి మరీ మాకు మరణశిక్ష విధించారు. అన్నీ నీవే అనుకున్న
నాకు చీకటి మిగిల్చి చేయరాని తప్పు చేశావు... ఇంకెంత కాలం ఒంటరిగా
నేను జీవితం గడపాలి తిరిగి నీవు వస్తే తప్పు...
మీ జ్ఞాపకాలే... నా ప్రాణం... మీ జ్ఞాపకాలతోనే ... నా ప్రయాణం
కీ॥శే॥ బద్రి రాధాకృష్ణమూర్తి గారు
అధినేత, శ్రీ మల్లిఖార్జున ఇంజనీరింగ్ కంపెనీ, నెల్లూరు.
కోడలు : బద్రి మంజుల
మనుమలు : బద్రి మల్లిఖార్జున్
బద్రి విష్ణేష్
- మీ దత్తపుత్రుడు
బద్రి హరిబాబు
96180 99999

ఇవి సర్కారు హత్యలే!

కృష్ణా జిల్లా పోరాటనగర్ కాలనీలో కల్తీ సారా త్రాగి 16 మంది అమాయక పేదలు ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది అమలాపురంలో ఇదే రీతిలో కల్తీ సారా పేదలను బలితీసుకొన్నది. రాష్ట్రంలోని ఎన్నో గ్రామాలలో కల్తీ సారా వాడకం విచ్చలవిడిగా నడుస్తున్నది. బెల్లం ఊటతో, మిథనాల్ అనే రసాయనంతో, రెక్టిఫైడ్ స్పిరిట్‌తో, మొలాసిస్‌తో రకరకాలుగా కల్తీ సారా వ్యాపారం నడుస్తున్నది మన రాష్ట్రంలో. చావులు జరిగినప్పుడు బయట ప్రపంచానికి తెలుస్తున్నది. అదిలేని చోట వేలాది మంది పేద ప్రజలు కల్తీ సారా కల్గించే విష ప్రభావం వల్ల ఆరోగ్యం కోల్పోయి, జీవచ్ఛవాల వలె తయారౌతున్నారు. అకాల మరణం చెందుతున్నారు.

రాష్ట్రంలో వేలాది బ్రాందీ షాపులు, వాటికి అనుబంధంగా అంతకు మూడింతల సంఖ్యలో బెల్ట్ షాపులు, వాటిలో కొరత లేకుండా చీప్ లిక్కర్ సీసాలు దొరుకుతున్నప్పుడు పేద ప్రజలు కల్తీ సారాకు ఎందుకు అలవాటుపడుతున్నారన్నది పెద్ద ప్రశ్న. ఇందుకు కారణం ప్రభుత్వం అవలంభిస్తున్న ఆటవిక విధానాలే అని చెప్పడానికి సందేహం అవసరం లేదు. గత ఆరేడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం మద్యం వ్యాపారాన్ని తన ప్రధాన రాబడి వనరుగా మార్చుకొంటున్నది. వార్షిక బడ్జెట్‌లో దాదాపు 30 శాతం ఆదాయం మద్యం వ్యాపారం వల్లనే వస్తున్నదంటే, దానిపై ప్రభుత్వం ఎంతగా ఆధారపడుతున్నదీ అర్థం చేసుకోవచ్చు. సులువుగా బొక్కసం నింపుకొనే మార్గంగా కన్పించడంతో ప్రభుత్వ అధికారులే నిస్సిగ్గుగా పథకాలు పెట్టి, ప్రలోభాలకు గురిచేసి, ఒత్తిడితెచ్చి మద్యం అమ్మకాలను ఏటికేడాది రెట్టింపు చేసుకొంటున్నారు. అంగళ్ల వేలం పాటల ద్వారా, టోకు వ్యాపారం ద్వారా, మద్యంపై వాణిజ్య పన్నుల ద్వారా జనాన్ని పీక్కొని తింటున్నారు. ఈ ఏడాది బడ్జెట్ ముందస్తు సమావేశంలో కూడా ఆర్థిక మంత్రి, ఎక్సైజ్ అధికారులను పిలిచి కనీసం 30 శాతం మద్యం అమ్మకాలు పెంచాలని లక్ష్యం నిర్దేశించాడంటే పరిస్థితి ఎంత ఘోరంగా, హీనంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ ఒత్తిడి వల్ల, అది కల్పిస్తున్న పోటీ వాతావరణం వల్ల మద్యం వ్యాపారులు అధిక ధరలకు అంగళ్ల వేలం పాడుకొంటున్నారు. టోకు వ్యాపారం ప్రభుత్వానిదే కాబట్టి టోకు ధరకు, చిల్లర ధరకు మధ్య ఉన్న వ్యత్యాసంతో ఈ వేలానికి పెట్టిన పెట్టుబడులు రాబట్టుకోవడం వ్యాపారులకు అసాధ్యంగా పరిణమిస్తున్నది. దానితో వారు చిల్లర ధరను ఇష్టం వచ్చినట్లు పెంచిపారేస్తున్నారు. ప్రభుత్వం కూడా టోకు ధరను ఏటా పెంచుతున్నది. దానితో పేదవాడి ఒక రోజు కూలీ ఒక చీప్‌లిక్కర్ సీసా కొనడానికి చాలడం లేదు. త్రాగుడుకు బానిసలైనవారు ఈ అధిక ధరలకు అల్లాడిపోతున్నారు. చవకగా మత్తు పానీయాలు దొరికే మార్గాలు అన్వేషిస్తున్నారు. దాని ఫలితమే కల్తీ సారా తయారీ, అమ్మకాలు, చావులు.

ప్రజలను పూటుగా త్రాగించి, వారి ఆరోగ్యాలు నాశనం చేసి, దాని ద్వారా వచ్చే రాబడితో పాలన సాగించాలనే హేయమైన, నీచమైన విధానానికి ప్రభుత్వం అలవాటు పడడం ఘోరమైన నేరం. కానీ అది ఒక సాంప్రదాయంగా నడిచిపోతున్నది. ప్రభుత్వం ధనాశతో, దురాశతో అమలు చేస్తున్న అక్రమ విధానాలే కల్తీ సారాకు ఆస్కారం కల్పిస్తున్నాయి. ఆ దృష్టితో చూసినప్పుడు కల్తీసారా చావులు సర్కారు చేస్తున్న హత్యలుగానే భావించాలి.

జమీన్‌రైతు

మద్యం ద్వారా వేల కోట్ల రూపాయల ఆర్జన చేస్తున్న ప్రభుత్వం, దాన్ని నిర్వహించే ఎక్సైజ్ విభాగాన్ని మాత్రం నిర్వీర్యం చేస్తున్నది. గత ఏడేళ్లుగా ఆ విభాగంలో కొత్త నియామకాలు లేవు. రిటైర్ అయిన పోస్టులు ఖాళీగా పెడుతున్నారు. మిగిలిన అధికారులు, సిబ్బందికి బ్రాందీ షాపుల చేత అధిక మొత్తం అమ్మకం జరిపించడానికే సమయం సరిపోతున్నది. దానితో గ్రామాలలో కల్తీ సారా వంటి అక్రమ వ్యాపారాలను అరికట్టే ప్రక్రియ మూలపడిపోయింది. అందుకు వారి వద్ద సిబ్బంది లేరు. నిఘా వ్యవస్థ, సమాచార సేకరణ లేదు. ఒక రకంగా చెప్పాలంటే ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను గాలికి వదిలి వేసింది.

ఒక ప్రక్క చీప్ లిక్కర్ ధరలు పెంచి పేదలకు అందుబాటు కాకుండా చేయడం, మరొక ప్రక్క ఆ శాఖను నిర్వీర్యం చేయడమే కల్తీ సారా మరణాలకు కారణాలు. ఇటువంటి దుర్ఘటనలు నివారింపబడాలంటే ముందుగా ప్రభుత్వం మద్యం ద్వారా వచ్చే అదాయం మీద దురాశను మానుకోవాలి. అప్పటి వరకు ప్రభుత్వం పెద్దలు చెప్పే మాటలన్నీ మోసపూరితమైనవనే భావించక తప్పదు.

జనవాణి

రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకును తెరిపించండి!

నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో అవకతవకలు జరిగాయని నిర్ధారణ కావడంతో జిల్లా కలెక్టర్ ఆ సంస్థను సీజ్ చేయించారు. రెడ్‌క్రాస్ నిర్వాహకుడు జిల్లా కలెక్టర్‌గారే. ఆయన పని ఒత్తిడితో సంస్థలో జరుగుతుండిన అవకతవకలను పరిశీలించలేకపోయారు. ప్రాణం నిల్పేందుకు కావాల్సిన రక్తం దొరకకుంటే ఎన్నో ప్రాణాలు పోతాయి. సంస్థ సక్రమంగా నిర్వహించగల సమర్థులను ఎంపికచేసి బ్లడ్‌బ్యాంకును తెరిపించే ఏర్పాట్లు చేయమనవి.

పి.రమణయ్య నెల్లూరు

ప్రజాప్రతినిధులు మారాలి!

డిశంబర్ 16వ తేది 'జమీన్‌రైతు' సంచికలో 'నెల్లూరు నగరం పరువు తీస్తున్న ప్రజాప్రతినిధుల సరసాలు' శీర్షికపేరిట వచ్చిన ఫోటోలు చూసి ఒక మహిళగా బాధేసింది. బారాషహీద్ దర్గా ప్రాంగణం, స్వర్ణాల చెరువు, రొట్టెల పండుగ పరమ పవిత్రమైన అంశాలు. ఇక్కడ గౌరవనీయులైన ప్రజాప్రతినిధుల ప్రవర్తన సభ్యసమాజం హర్షించతగ్గ రీతిలో లేదు. ఈ ప్రజాప్రతినిధులు ఎందుకిలా ప్రవరిస్తున్నారో అర్థం కావడం లేదు. పవిత్రమైన ప్రదేశాల్లో ఇటువంటి వారిని పిలిచి శాలువలతో సత్కరిస్తూ నాయకులు పెద్ద తప్పు చేస్తున్నారు.

షేక్ జరీనాబేగం నెల్లూరు

నివ్వెరపోవాల్సిన అవసరం లేదు!

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో ఉన్న పిల్లలకు పొద్దున ఉపాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన ఖర్చులకు ప్రభుత్వం ఇచ్చేది 15 రూపాయలు మాత్రమే. ఈ మొత్తంతో స్టార్ హోటల్‌లో మాదిరి నాణ్యమైన భోజనం పెట్టలేదని అధికారులు, ఎమ్మెల్యేలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేయడం, చర్యలు తీసుకోవాలని పై అధికార్లకు తెల్పడం, పత్రికల వాళ్లను పిలిచి పత్రికల్లో బహుళంగా బొమ్మలు వేసుకోవడం ఇదొక ప్రహసనం. ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసిన వాళ్లకు ఆ పదిహేను రూపాయలిస్తే అటువంటి భోజనమే పెడతారు. సరిపడినంత డబ్బిచ్చి నాణ్యమైన భోజనం పెట్టకపోతే అప్పుడు ఎన్ని చర్యలు తీసుకొన్నా సబబే.

తూపిలి వనమాలి నెల్లూరు

రైతులకో పథకం ప్రవేశపెట్టండి!

రైతుల పరిస్థితి నిత్యం సమీక్షించేందుకు, వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు, వ్యవసాయ అభివృద్ధి సూత్రాలకు అవగాహన కల్పించేందుకు ఒక పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టాలి. పంట మార్పిడి, గిట్టుబాటు ధరలు, బ్యాంక్ రుణ సౌకర్యం, భూసారం, పశువ్యాధుల నిర్మూలన, పాడి పరిశ్రమాభివృద్ధి మొదలైన అంశాలన్నీ ఈ పథకంలో చేరిస్తే బాగుంటుంది.

ఎస్.రమణయ్య దామవరం

70 ఏళ్ల క్రితం ఈవారం

9-1-1941
పేజీలు : 8 వెల: అణా

నెల్లూరు లూటీలు

హిందూ మహమ్మదీయ మత కలహ కారణంగా దాడివారివీధి, కుమ్మరవీధుల్లో ఇంకా ప్రతి రాత్రి తలుపులో, ద్వారబంధాలో, జింకు షీట్లో ఏదో ఒక అపహరణం జరుగుతూనే ఉంది. మొన్న దొరికిన అయ్యాగార్లను, మియ్యాగార్లను బట్టి చూస్తే ఈ కలహాలకు సంబంధంలేని దోపిడీగాండ్లు గూడా చేస్తున్నారనేది తెలుస్తున్నది. కానీ పోయిన వస్తువుల పత్తా మాత్రం తియ్యడం లేదు. ఏమంటుంది పోలీసు?

జమీన్‌రైతు కేసు

గూడూరు ప్రెసిడెంటు లక్ష్మీనారాయణరెడ్డి గారు 'జమీన్‌రైతు' పత్రికాధిపతిపై వేసిన కేసు గూడూరు నుండి మరొక కోర్టుకు మార్చమని 3వ తేదీన జిల్లా కలెక్టర్ వద్ద రామానాయుడు పిటిషన్ పెట్టగా విచారణ నిలుపమని ఉత్తర్వుచేసి రికార్డు తనకు పంపమనిరి.

యాహ్యాలి గారు

మన యాహ్యాలి సాహెబ్ గారిని జిల్లా జడ్జి పదవి నుండి ఇన్‌కంటాక్స్ ట్రిబ్యునల్ అధ్యక్షులుగా నియమించారట. ఇది హిందూ దేశమంతటికీ మహోన్నత పదవి. మనవారు అత్యున్నత దశకు పోయినందుకు మనం కొంచెం సేపు గర్విద్దాం.

కోడూరు నాటకం

కోడూరు హిందూ మహాసభ సహాయార్థం 16వ తేది రామదాసు నాటకాన్ని వేస్తున్నారు పౌరులు. సత్కార్యంగాన ఎల్లరు సాయపడి ప్రోత్సహించమని హిందూ సభ పెద్దలు కోరుతున్నారు. ఉడతకు ఉడతా భక్తి.

50 ఏళ్ల క్రితం ఈవారం

5-1-1962
పేజీలు: 12 వెల: 0-20 న.పై

జి.సి.కొండయ్యను గెలిపించండి!

నెల్లూరు పట్టణ కాంగ్రెసు వర్కర్ల సమావేశం ఈ నెల 2వ తేది జిల్లా కాంగ్రెసు కార్యాలయంలో జరిగింది. పట్టణంలోని కౌన్సిలర్లు, కాంగ్రెస్ వాదులు దాదాపు నూరుమంది పాల్గొన్నారు. నెల్లూరు నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా నియమితుడైన జి.సి.కొండయ్యను బలపరచి ఎన్నికల కార్యక్రమాన్ని నిర్ణయించుకోవడానికి ఈ సమావేశం ఉద్దేశించబడినది.

ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఏ.సి.సుబ్బారెడ్డి గారు కాంగ్రెసు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కొండయ్య అభ్యర్థిత్వాన్ని తాను హృదయపూర్వకంగా బలపరుస్తున్నానని చెప్పారు. గత పర్యాయం తాను అభ్యర్థిగా ఉన్నప్పుడు పట్టణంలోని కాంగ్రెస్ కార్యకర్తలందరూ ఎంత సమధికోత్సాహంతో పనిచేశారో నేడు అంతకు మించిన ఉత్సాహంతో పనిజేసి కొండయ్యను గెలిపించవలసినదిగా కోరారు.

తాను నెల్లూరు నియోజకవర్గంలో పోటీచేయక పోవడానికి కారణాలను పేర్కొంటూ తానెవ్వరికీ భయపడననీ, తానిచ్చట పోటీజేస్తే ప్రతి ఇంటికి వెళ్లి, ప్రతి ఓటరును కలుసుకొనే సాంప్రదాయం ఉంది కాబట్టి నెల రోజులు ఒక్క నెల్లూరు పట్టణంలోనే ఉండిపోవాల్సి వస్తుందని; ఇతర నియోజకవర్గాలలో పోటీచేసే కాంగ్రెసు అభ్యర్థులకు ప్రచారంచేసే అవకాశం లేకుండా పోతుంది కాబట్టి జిల్లా అంతటా తిరిగి కాంగ్రెసు విజయానికి కృషిచేసే అవకాశం కోసం రాపూరుకు వెళ్లడం జరిగిందని చెప్పారు.

నెల్లూరు ముచ్చట్లు

ఉల్లాసంగా... ఉత్సాహంగా!

నెల్లూరీయులు నూతన సంవత్సరానికి ఉల్లాసంగా ఉత్సాహంగా స్వాగతం పలికారు. చలి, వర్షం వంటి వాతావరణాన్ని ఏమాత్రం లెక్కచేయక ఆనందంగా ఉండేందుకు ప్రయత్నించారు. నూతన సంవత్సరంలోకి ప్రవేశించిన వెంటనే నగరంలోని పలు సెంటర్లలో యువకులు బాణాసంచా మోతలతో హోరెత్తించారు. స్కూటర్లపై తిరుగుతూ పలువురికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సాయిబాబా, వినాయక స్వామి ఆలయాలు అర్ధరాత్రి కూడా తెరచి ఉండడంతో కొందరు దైవ దర్శనానికి బయలుదేరి వెళ్లారు. చర్చీలలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎప్పుడూ లేనిది ఈసారి బారాషాహిద్ దర్గాలో కూడా భక్తులు ఒత్తిడి చేసి మరీ 'ఫాతేహా' చేయించారు. ఇదివరకెన్నడూ ఈ దర్గాలో న్యూయియర్ ప్రార్థనలు జరగలేదు. ఉదయం వర్షం కురుస్తున్నా రాజరాజేశ్వరమ్మ, మాగుంట లేఅవుట్‌లోని వెంకటేశ్వరస్వామి, రంగనాయకులస్వామి గుడుల్లో భక్తులు దర్శనానికి బారులు తీరారు. కేకులు, పూలమాలలు, బొకేలు కొంటూ ప్రజలు బిజీగా కనపడ్డారు. చేపలు, చికెన్, మటన్ అమ్మే దుకాణాల తోపాటు బ్రాందీషాపుల వద్దా రద్దీ కనిపించింది.

కలెక్టర్ బంగళాలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కలెక్టర్ శ్రీధర్‌రెడ్డిని కలసి శుభాకాంక్షలందించారు. కలెక్టర్, ఎస్పీలిద్దరూ కలసి వెళ్లి జిల్లా జడ్జి శ్రీరామమూర్తికి శుభాకాంక్షలందించారు. సాయంత్రానికి నూతన సంవత్సర ఉత్సాహం కాస్త తగ్గి నగరంలోని రోడ్లన్నీ నిర్మానుష్యమయ్యాయి.

రాష్ట్రపతి పర్యటనకు పిలుపు లేదు!

శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రం (షార్)కు 2వ తేది రాష్ట్రపతి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని కవరేజికి ఇస్రో అధికారులు మీడియాకు ఆహ్వానం మందించలేదు. భద్రతా కారణాలనే కుంటిసాకుతో మీడియాను అనుమతించక ఇస్రో సైట్ నుంచి మీడియాకు నెట్ కవరేజి ఇచ్చారు. రాకెట్ల ప్రయోగ సమయంలో ఒకటికి రెండు సార్లు మీడియాను శ్రీహరికోటకు తీసుకెళ్లే ఇస్రో ఈ సారి వివక్ష చూపినా మీడియా మాత్రం అధికోత్సాహంతో ఇస్రో నెట్‌లో పంపిన ఫోటోలను విరివిగా ప్రచురించింది. ప్రధానిగా పి.వి.నరసింహారావు షార్ వచ్చిన సమయంలోనూ ఇదే రీతిన ఇస్రో అధికారులు మీడియాను అనుమతించలేదు. చెన్నై నుంచి కారులో వచ్చిన పి.విని సూళ్లూరుపేట జంక్షన్‌లో విలేకరులు నిలిపి ధర్నా చేయడంతో అనుమతించారు. మళ్లీ ఇన్నాళ్లకు ఇదే పరిస్థితి ఎదురయ్యింది. మీడియా మధ్య పోటీ, తగువులు, తంటాలను అధికారులు తెలివిగా ఈ రీతిన ఉపయోగించుకొంటున్నారు.

చంద్రబాబు రాక

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ సర్వాధినేత నారా చంద్రబాబు నాయుడు పెద్ద పండుగ తర్వాత జిల్లాలో పర్యటించనున్నారు. మద్యం సిండికేట్ల అక్రమార్జనపై ఆయన ఆరంభించనున్న 'పోరుబాట' కార్యక్రమాన్ని ఉప ఎన్నికలు జరుగుతున్న ఉదయగిరి లేదా కోవూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేయవచ్చు. ఈ మేరకు కార్యక్రమాన్ని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రూపొందిస్తున్నాడు.

భయంలేని దొంగలు

దొంగతనం చేసేవాడికి భయముంటుందని పాత రోజుల్లో చెప్పేవారు. ఇప్పుడు దొంగలు తెగబడుతున్నారు. 2వ తేది విజయమహల్ గేటు వద్ద భాగ్యలక్ష్మి అనే మహిళ మెడలోని సరుడు దొంగ నరేంద్ర లాక్కొని వెళ్తుండగా కేకలు పెట్టింది. ఎవరో మంచి పోలీసు షమీర్(1799) వెనుకబడ్డాడు. దొంగ కత్తితో రెండు పోట్లు పొడిచినా భయపడకుండా అతడ్ని పట్టుకోవడంతోపాటు సరుడ్ని కాపాడాడు. దొంగరాముడిది పొదలకూరు మండలం అమ్మవారిపాళెమట. దర్జాగా డ్రసింగ్, స్కూటర్ ఎక్కి దొంగతనం చేయడం ఇతని దినచర్య. ఓఎస్‌డి కిషోర్‌గారు నగరంలో చైన్ దొంగలపై ప్రత్యేక దృష్టి పెట్టి మహిళల మన్ననలు పొందండి సార్!

స్థానిక సంస్థల ఎన్నికలు లేవు!

మునిసిపాలిటీలు, కార్పొరేషన్ కొత్త పాలకవర్గాలను ఎన్నుకొనేందుకు మార్చి నెలలో ఎన్నికలను ప్రభుత్వం జరపతలపెట్టి గెజిట్ విడుదల చేసింది. దీనిలో నెల్లూరు కార్పొరేషన్, కావలి, గూడూరు, వెంకటగిరి మునిసిపాలిటీల పేర్లులేవు. మలి విడతగా నవంబరులో జరిగే జాబితాలో మన జిల్లాలో ఎన్నికలు జరిగే అవకాశముంది. మార్చి నెలలో ఎన్నికలకు వెళ్లే ధైర్యంలేక మొదటి విడత ఎన్నికలు జరిగే జాబితాలో పేర్లు లేకుండా చేయడంలో జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పే పెద్దల హస్తమున్నట్లుంది.

సిపిఎం జిల్లా కార్యదర్శిగా చంద్ర రాజగోపాల్!

సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శిగా చంద్ర రాజగోపాల్ ఎన్నికయ్యారు. పార్టీలోని ఎస్ఎఫ్ఐ విభాగం నుంచి అన్ని విభాగాల్లో పనిచేసిన అనుభవముందాయనకు. గత కొన్నాళ్లుగా సిపిఎం ఆఫీసు నిర్వహణ కూడా రాజగోపాల్ చూస్తున్నారు. పార్టీలోని రైతు విభాగం బాధ్యతలు వంటివి ఆయనే నిర్వర్తించేవారు. సిపిఐ నుంచి సిపిఎం పార్టీ విడిపోయాక జక్కా వెంకయ్య, టి.పి.భానురాజు జిల్లా కార్యదర్శులుగా పనిచేశారు. అనారోగ్య కారణంగా వీరిద్దరూ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో చంద్ర రాజగోపాల్ వీటిని స్వీకరించక తప్పలేదు. సౌమ్యునిగా పేరు గాంచిన రాజగోపాల్ పార్టీకి పాత జవసత్వాలు తెచ్చిపెట్టే రీతిలో పనిచేస్తే ఆ పార్టీ కార్యకర్తలు సంతోషిస్తారు.

సిఎం బొమ్మలు లేవు

గతవారం చిరంజీవి నెల్లూరు పర్యటన సందర్భంగా ఫ్లెక్సీలతో ప్రచారం హోరెత్తించారు. విచిత్రమేమిటంటే ఈ ఫ్లెక్సీలలో ఎక్కడా ముఖ్యమంత్రి బొమ్మ లేదు. బహిరంగ సభ జరిగిన వేదిక మీద కూడా చిరంజీవి, రామనారాయణరెడ్డి, వివేకానందరెడ్డి, శ్రీధర్‌కృష్ణారెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పితాని సత్యనారాయణల బొమ్మలు పెట్టారు తప్ప సిఎం బొమ్మ మాటమాత్రానికి కూడా పెట్టకపోవడం చర్చనీయాంశమయ్యింది.



బిట్రగుంట వచ్చిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ హస్తానాకు అక్కడి సమస్యలపై వినతి పత్రం అందిస్తున్న కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, నెల్లూరు ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి.

నూతన సంవత్సర వేడుకలకు దూరంగా...

నూతన సంవత్సరం రోజు నెల్లూరుకు దూరమయ్యారు జంట ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి. వివేకానందరెడ్డి హైదరాబాద్‌లో గడపగా, ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి శ్రీశైలంలో విడిది చేశారు.

రంగడి అధ్యయనోత్సవాలు

నెల్లూరు తల్పగిరి రంగనాథస్వామి అధ్యయనోత్సవాలు డిశంబర్ 26వ తేది మొదలయ్యాయి. ఇవి జనవరి 14వ తేది వరకు జరుగుతాయి. 7వ తేది రాపత్తు ఉత్సవాల్లో మూడవ ఉత్సవంతో మొదలై 14వ తేది వరకు జరుగుతాయి. 15వ తేది ఇయర్పాశాత్తుమురై ఉత్సవం జరుగుతుంది. 14వ తేది స్వామికి భోగి కళ్యాణం, 16వ తేది కనుమపార్వేట ఉత్సవాలు జరుగుతాయి. భక్తులను ఈ ఉత్సవాలకు తరలి రమ్మంటున్నాడు దేవస్థానం ఛైర్మన్ పత్తి రవీంద్రబాబు.

డాక్టర్ రోశయ్యకు సతీవియోగం

నెల్లూరు పొగతోటలో ప్రముఖ సర్జన్ డాక్టర్ బొగ్గవరపు రోశయ్య సతీమణి వీరరత్నమ్మ (73) 4తేది మరణించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఆత్మీయురాలిని కోల్పోయిన డాక్టర్ రోశయ్య కుటుంబానికి మా సానుభూతి.

మరువలేము నాన్న...



షేక్ మహబూబ్ సాహెబ్
(మహబూబ్ క్లాత్ మర్చంట్స్)
అల్లూరు.
ఎనిమిదవ వర్ధంతి(బర్త్)
13.1.2012 సందర్భంగా
శ్రద్ధాంజలి ఘటిస్తూ..
కుమారుడు ... అల్లూరు రహీం
సబ్ ఎడిటర్
జమీన్‌రైతు, నెల్లూరు.
కోడలు ... గౌసున్నీసా బేగం
మనుమడు ... ఆషిక్

వెండి స్పెషల్ ఆఫర్
925 STERLING SILVER
(EXPORT QUALITY)
ఆంధ్రాలోనే మెగా వెండి షోరూం
సిల్వర్ ప్లాజా
EXCLUSIVE SILVER SHOW ROOM
AUnit of GOLD PALACE
హోటల్ శివం ఎదురుగా,
జిల్లాపరిషత్ ఆఫీసు సెంటర్
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్ : 2331132, 2331121

వజ్రం - బంగారం - వెండి స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు
గ్రాముకు రూ. 50/- తగ్గింపు
డైమండ్స్‌పై 10% తగ్గింపు
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లాపరిషత్ ఆఫీసు సెంటర్,ఆచారివీధి,
నెల్లూరు. ఫోన్ : 2331133, 2327611



సామాజిక న్యాయం

కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం!



ఆత్మకూరు బస్టాండు వద్ద జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న చిరంజీవి.

సామాజిక న్యాయం నినాదంతో రాజకీయ రంగప్రవేశం చేసిన చిరంజీవి ఆ న్యాయం కోసమే కాంగ్రెస్‌పార్టీలో ప్రజారాజ్యం పార్టీని విలీనం చేశానని ప్రకటించాడు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేసేందుకు నగరానికి విచ్చేశాడు చిరంజీవి. సర్వేపల్లి కాలువపై స్టోన్‌హౌస్ పేట, శెట్టిగుంటరోడ్డు, హరనాధపురం ప్రాంతాలలో 3.17 కోట్ల రూపాయలతో నిర్మించిన ఐదు వంతెనలను ప్రారంభించడంతోపాటు మరో 3కోట్ల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని, అధినాయకులను ప్రశంసిస్తూనే అభిమానులు తనకు ప్రాణమని పదేపదే చెప్పి ఇటీవల ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడం వలన వారిలో కల్గిన అసంతృప్తిని చల్లార్చే ప్రయత్నం చేశారు. తన తల్లికి జన్మనిచ్చిన సింహపురి గడ్డ తనకు మేనమామ ఇంటితో సమానమని ఆనం సోదరులు తనపై చూపుతున్న ప్రేమను చూస్తుంటే సంతోషంగా వుందని చెప్పిన చిరంజీవి ఆనం సోదరులు తనకు మేనమామలు అని సంబోధించారు. కాంగ్రెస్ పార్టీలో తనకు అధినేత్రి సోనియా, యువనేత రాహుల్ గాంధీలతో సాన్నిహిత్యం వుందని చెప్పుకోవడానికి పలుమార్లు తాపత్రయపడ్డారాయన. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించడం, వాటి గణాంకాలను చెప్పడంలో తడబడి ప్రక్కనున్న మంత్రులను అడిగి చెప్పాడు. జగన్, చంద్రబాబులపై పరోక్ష విమర్శలు గుప్పించారు. తండ్రి నుంచి ఆస్తి వారసత్వంగా వచ్చినట్లు ముఖ్యమంత్రి పదవిని ఆశించిన యువనేత భంగపడ్డాడన్నారు. వైఎస్ మృతదేహం వుండగానే కుర్చీ కోసం ప్రయత్నించడం దారుణమన్నారు. త్వరలో ఆయన జైలుకు పోనున్నారని అన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా వున్న మరొకాయన ఇప్పుడు రైతు యాత్రలంటూ తిరుగుతూ రైతుల పట్ల ఎనలేని ప్రేమ చూపుతున్నాడని, ఆయన ఎన్ని యాత్రలు చేసినా అధికారంలోకి రావడం జరగదన్నారు. గత 70 ఏళ్లలో నెల్లూరు నగరంలో ఎన్నడూ జరగని ఆ అభివృద్ధి ఆనం సోదరుల నేతృత్వంలో జరుగుతోందని పొగిడిన చిరంజీవి, అభివృద్ధిలో తమ ఎమ్మెల్యే ముంగమూరు భాగస్వామ్యం కావడం సంతోషకరం అన్నారు. కాంగ్రెస్ పార్టీలో వున్నా రాష్ట్రప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను సహించనని, విద్యుత్ ఛార్జీల పెంపుపైన తన వ్యతిరేకతను ముఖ్యమంత్రికి తెలియజేశానన్నారు. అభిమానులే తన బలం, బలహీనత అని చెప్పారు. ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇన్‌ఛార్జ్ మంత్రి పితాని సత్యనారాయణ, ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, శ్రీధర్‌కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేడి!

● నోటిఫికేషన్ కంటే ముందే ప్రచారం ఆరంభం

జిల్లాలో ఎన్నికల వేడి మొదలైంది. కోవూరు ఉప ఎన్నికల బరిలో నిలచేందుకు తెలుగుదేశంపార్టీ తరపున సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సిద్ధం కాగా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అందరికంటే ముందు తయారైనాడు. కాంగ్రెస్‌పార్టీకి సంబంధించినంతవరకు అభ్యర్థి ఎంపిక ఇంకా జరగకపోయినా వారు ప్రతిష్టాత్మకంగానే భావిస్తున్నారు. మరోవైపు విప్‌ను ధిక్కరించిన ఎమ్మెల్యేలపై వేటు పడనున్న నేపథ్యంలో ఉదయగిరి స్థానానికి ఎన్నిక జరగనుంది. ఈ పరిస్థితుల్లో ఎవరికి వారు తమ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్న రెండు నియోజకవర్గాలలో ముక్కోణపు పోటీ జరగనుంది. సామాజిక న్యాయమని ఊదరగొట్టిన చిరంజీవి కాంగ్రెస్‌పార్టీలో విలీనం చేసి కాంగ్రెస్ నేతగా అవతారం ఎత్తాడు. నిన్నమొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలుగా వున్న కొందరు జగన్ పక్షం చేరడంతో ఆ పార్టీ ఓట్లు రెండుగా చీలిపోతున్నాయి. కోవూరు, ఉదయగిరిలో ఈ పరిస్థితి ఎదురౌతోంది. ఇక టిడిపి ఎమ్మెల్యేగా గెలిచి తర్వాత వైఎస్ పంచన, అటు తర్వాత జగన్‌కు జైకొట్టి చేతులారా ఉప ఎన్నిక తెచ్చుకొన్న ప్రసన్న తిరిగి ఎన్నికల బరిలో నిలుస్తున్నాడు. గత ఎన్నికలలో ఆయనకు ప్రత్యర్థిగా ప్రజారాజ్యం పార్టీ తరపున పోటీచేసిన గిరిజన మహిళ తుపాకుల మునెమ్మ ఇప్పుడు పార్టీ మారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రసన్న విజయానికి మద్దత్తుగా ప్రచారం నిర్వహిస్తుండడం విశేషం. మొత్తం మీద చిత్ర విచిత్రమైన పరిస్థితులు, మార్పులు ఈ ఎన్నికలలో చోటు చేసుకొంటున్నాయి.

వణికించి... వదలింది!

● థానే రాకపోవడం వల్ల మేలు జరిగింది



తీరప్రాంతంలో అలల ఉధృతి.

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం థానే పెను తుఫానుగా మారడంతో జిల్లావాసులు వణికిపోయారు. ముఖ్యంగా తీరప్రాంత గ్రామాల ప్రజలు, మత్స్యకారులు నిద్రలేని రాత్రులు గడిపారు. గతంలో సంభవించిన తుపానుల వలన కల్గిన ప్రాణ, ఆస్తి నష్టాన్ని దృష్టిలో వుంచుకొని అధికారులు ఎన్ని ముందస్తు చర్యలు చేపట్టినా ప్రజలు మాత్రం తీవ్ర ఆందోళన చెందారు. నెల్లూరు, కడలూరు మధ్య తీరాన్ని దాటుతుందని వాతావరణ విభాగం ప్రకటించడంతో జనం అప్రమత్తమయ్యారు. అయితే థానే తుపాను ముద్రాసు – పుదుచ్చేరిల వైపు వెళ్లడంతో జిల్లా మీద దాని ప్రభావం పెద్దగా లేకుండా పోయింది. అయినప్పటికీ రెండురోజులపాటు మైపాడు, ఇసుకపల్లి, రాముడుపాళెం తదితర ప్రాంతాలలో సముద్రం 200మీటర్ల మేర ముందుకు చొచ్చుకొని రావడంతో మత్స్యకారులు భీతావహులయ్యారు. ఒడ్డున కట్టి వుంచిన బోట్లు, విలువైన వలలు ధ్వంసమైపోయాయి. అలల ఉధృతి అధికంగా వుండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడిపారు. జిల్లా కలెక్టర్ హెచ్చరికలతో వివిధ ప్రాంతాలలోని ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. థానే తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు రైతులకు నష్టం సంభవించింది. అసలే నకిలీ విత్తనాల కారణంగా మొలకలు ఎత్తక, నారుమళ్లు దెబ్బతిని నష్టపోయి వున్న రైతులకు ఈ తుపాను గోరుచుట్టుపై రోకలిపోటులా పరిణమించింది.

పర్సంటేజీల వివేకా!

ఇసుక మాఫియా, మద్యం సిండికేట్ల నుంచి నెలమామూళ్లు తీసుకొనే ఆనం వివేకానందరెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని టిడిపి నేత కోటం రెడ్డి శ్రీనివాసులరెడ్డి విమర్శించారు. టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివేకాపై విరుచుకపడ్డారు. ప్రతి పనిలో పర్సంటేజీ ముట్టజెప్తే ఆ వైపు కన్నెత్తి చూడని వివేకా, అడిగినంత ఇవ్వకుంటే కన్నెర చేయడం సర్వసాధారణమైందన్నారు. తాను అనుచరులు అవినీతికి పాల్పడుతూ కోట్లకు పడగలెత్తిన వివేకానందరెడ్డికి అహంకారంతో కన్ను మిన్ను కానదంలేదన్నారు. అధికార మదంతో విర్ర వీగుతున్న ఆనం సోదరులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేరోజులు దగ్గరపడ్డాయన్నారు. నగరమంతా వివేకానందరెడ్డి, శ్రీధర్‌కృష్ణారెడ్డి, భానుశ్రీ ఫోటోలు తప్ప ఇతరుల ఫ్లెక్సీలు కన్పడితే మునిసిపాలిటీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి.

వారికి చెప్పి తొలగించడం దారుణమన్నారు. 2001 సంవత్సరంలో ఇంటిపన్నులు స్వల్పంగా పెంచినపుడు అరచిగగ్గోలు పెట్టిన వివేకానందరెడ్డి ఇప్పుడు 200శాతం పెంచడాన్ని సమర్థించుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. చిల్డ్రన్స్‌పార్కు రోడ్డు పనులు బినామీలతో జరిపించుకొని గత ఎన్నికలలో పెట్టిన ఖర్చును వివేకా రాబట్టుకొన్నాడని ఆరోపించారు.

మహిళల మనసు దోస్తున్నలేపాక్షి క్రాఫ్ట్ బజార్!



టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన లేపాక్షి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్ తదితరులు.

నెల్లూరు టిటిడి కళ్యాణ మండపంలో లేపాక్షి క్రాఫ్ట్‌బజార్‌ను 30 తేది జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్ ప్రారంభించారు. క్రాఫ్ట్‌బజార్‌లో మంగళగిరి, పోచంపల్లి, వెంకటగిరి, గద్వాల్, సిద్దిపేట్, నారాయణ్‌పేట్, చీరాల చేనేత వస్త్రాలు మహిళల మనసు దోస్తున్నాయి. కలంకారి, బాటిక్ ప్రింటింగ్, బెంగాలి కాటన్, కాశ్మీరి సిల్క్, లక్నో చికన్ వర్క్ వస్త్రాలు అబ్బురపరుస్తున్నాయి. హస్తకళావస్తువులలో కొండపల్లి, ఏటికొప్పాక, నిర్మల్ బొమ్మలు, ఎ.పి ఉడ్ కార్వింగ్స్, బంజారా– క్రోచెట్‌లేస్, హైదరాబాద్ ముత్యాలు, మెటల్ కాస్టింగ్స్, నిర్మల్ పెయింటింగ్, బిద్రి, బొబ్బిలి వీణలు, లెదర్‌వేరే, వులన్ కార్పెట్స్ అందుబాటులో వున్నాయి. ఉత్పత్తిదారులచే నేరుగా అమ్మకాలు చేస్తున్నందు వల్ల ధరల విషయంలో చింతలేదు. 10వతేది వరకు ఈ హస్తకళావస్తువులు, చేనేత వస్త్రాల ప్రదర్శన కొనసాగుతుంది.

రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ మూసివేయాలన్న కలెక్టర్ తొందరపాటు నిర్ణయం రోగుల ప్రాణాలతో చెలగాటంగా మారింది

ఎలుకలున్నాయని ఇల్లు తగలబెడతారా?

ఇంట్లో ఎలుకలు దూరాయని, ఇల్లు తగలబెట్టుకోవడం తెలివైనవాడు చేసే పని కాదు. నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ విషయంలో జిల్లా కలెక్టర్ గారి నిర్ణయం ఈ తరహాలోనే వుందని చెప్పక తప్పడం లేదు. నెల్లూరు ప్రజలు గర్వపడే స్వచ్ఛంద సంస్థలో రెడ్‌క్రాస్ ఒకటి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో రెడ్‌క్రాస్ కేంద్రాలున్నాయి. కానీ నెల్లూరులో జరిగినంత విస్తృతస్థాయి సేవా కార్యక్రమాలు మరెక్కడా అమలు జరగడం లేదని ఘంటాపథంగా చెప్పవచ్చు. బ్లడ్ బ్యాంక్, శవ సంరక్షణ శీతల పేటికలు, మానసిక వికలాంగులైన బాల బాలికలకు కొత్త జీవితాన్ని ప్రసాదించే విద్యాలయం, క్యాన్సర్ పరీక్షా కేంద్రం, పల్లెపాడు గాంధీ మహాత్ముడి స్మారక ఆశ్రమ పునరుద్ధరణ, మత్స్యకారులకు ప్రాథమిక వసతుల కల్పన వంటి సేవా కార్యక్రమాలన్నింటినీ ఆచరించి చూపుతున్న సంస్థ అది. తామిచ్చే దానం సక్రమంగా వినియోగమౌతుందనే విశ్వాసం నెల్లూరు వదాన్యులలో కల్పించగలగడం వల్లనే ఇది వీలౌతున్నది. అందుకొక ఉదాహరణ క్యాన్సర్ నిర్ధారణ కేంద్రం. కేవలం దాతల సహకారంతో వృద్ధి చెందిన సంస్థ అది. జెఎస్.రెడ్డి, దొడ్ల కుటుంబం, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వంటి వదాన్యులెందరో అది దిన దినాభివృద్ధి చెందడానికి తమ వంతు చేయూత అందిస్తున్నారు. సంస్థ మీద ఎంత నమ్మకం లేకుంటే అంత భూరి విరాళాలు అడగగానే ఇస్తారు దాతలు?

నిర్వహణపై ఆరోపణలు

అయితే రెడ్‌క్రాస్ నిర్వహణలో పెత్తందారీతనం నెలకొంటుందన్న ఆరోపణ చాలాకాలం నుంచే విన్పడుతున్నది. ఒకే యాజమాన్యం దశాబ్దాల తరబడి దానికి అంటుకొని వుందన్నది నిజం కూడా. ఒకే వ్యక్తి ఒకే పని ఏళ్ల తరబడి చేస్తున్నప్పుడు కొన్ని లోటుపాట్లు జరగడం సహజం. వాటిని సరిదిద్దాలంటే ఆ వ్యక్తిని సంస్కరించాలి లేదంటే ఆ వ్యక్తిని పక్కకు తప్పించి, మరింత సమర్థుడైన వాడికి బాధ్యత అప్పచెప్పాలి. సాధారణ సంస్థలైతే ఈ పాటికి ఆ పని ఎప్పుడో జరిగిపోయి వుండేది. మురుగు కాలువల సంఘం పెత్తనం దొరుకుతుందని తెలిసినా అది తమకే కావాలని కోరుకొనే రాజకీయవాదులు నెల్లూరులో దండిగా వున్నారు. ఏ సంస్థనూ వదలకుండా పోటీలు పడే వారికి కొదువే లేదు. కానీ దశాబ్దాల పాటు రెడ్‌క్రాస్ జోలికి మాత్రం నెల్లూరు రాజకీయవాదులు వెళ్లడం లేదంటే అందుకు కారణం, ఆ సంస్థలో సేవ తప్ప మరే గిట్టుబాటూ వుండక పోవడం. అంకిత భావం, సేవా తత్పరత, సంకల్ప శుద్ధి వున్నవారు మాత్రమే రెడ్‌క్రాస్ నిర్వహణలో పాలు పంచుకోగలరు.

డాక్టర్ ఎవిఎస్‌పై అక్కసు!

డాక్టర్ ఎవి.సుబ్రహ్మణ్యం గత ఇరవై ఏళ్లకు పైబడి రెడ్‌క్రాస్ నిర్వహణ చూస్తున్నాడు. రెడ్‌క్రాస్ పేరు చెప్తే గుర్తుకు వచ్చేది ఆయన పేరు మాత్రమే. దాతలతో కానీ, జిల్లా కలెక్టర్‌తో సహా అధికారులతో కానీ, విదేశాల నుంచి వచ్చే స్వచ్ఛంద సంస్థలతో కానీ ఆయనొక్కడే మాట్లాడు

కొరవ 14వ పేజీలో



వివాదాలకు కేంద్రబిందువుగా మారిన నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్.







విశాలాక్షి వృద్ధుల ఆశ్రమంలో జరిగిన నూతన సంవత్సర వేడుకలలో నెల్లూరు క్లబ్ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, అమరావతి కృష్ణారెడ్డి, కోసూరు రత్నం తదితరులు.



నూతన సంవత్సరం సందర్భంగా నెల్లూరు అరవింద్ కిడ్నీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన శిబిరంలో రక్తదానం చేస్తున్న డాక్టర్ ఎస్వీఎల్.నరసింహారావు.

విప్‌ధిక్కారకులపై చర్యలేవి?



పార్టీలు మార్చే వ్యక్తులను శిక్షించే ఫిరాయింపుదారుల చట్టం అధికారపార్టీ చేతిలో ఆయుధంగా మారిందని తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, కోవూరు టిడిపి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించాడు. బస్వాయపాళెంలో జరిగిన టిడిపి కార్యకర్తల పరిచయ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన అధికారపార్టీపై విమర్శలు గుప్పించారు. శాసనసభలో అధికార పార్టీ జారీ చేసిన విప్‌లను ధిక్కరించిన వారి మీద ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టక పోవడం సిగ్గుచేటన్నారు. కనీసం వారికి నోటీసులు కూడా జారీ చేయలేదన్నారు. ఆ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకొనే అధికారం వున్నా ఆ పని చేయకుండా ముఖ్యమంత్రి, స్పీకర్ ఫిరాయింపుల చట్టాన్ని తమకు అనుకూలంగా మలచు కొన్నారన్నారు. చట్టసభల్లో బిల్లులు ఆమోదం పొందాలన్నా, అవిశ్వాస తీర్మానాల్లో నెగ్గాలన్నా ఓటుకు నోట్లు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కోవూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేసిన ఆయన ప్రసన్న కుమార్‌రెడ్డిపై విమర్శలు చేశారు.

సోమిరెడ్డి విమర్శ

వైఎస్ హయాంలో ఆకర్ష్‌లు, జగన్‌తో లాలూచీ స్కీంలు పెట్టుకొని అమ్ముడుపోయిన కొందరు ప్రజాప్రతినిధులు తగుదునమ్మానని తిరిగి ఎన్నికలకు వస్తున్నారని విమర్శించారు. వీరి చేష్టలను ప్రజలు గమనిస్తున్నారని, ఉప ఎన్నికలలో ఇలాంటి వారందరికి తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, బెజవాడ ఓబులరెడ్డి, ఉక్కాల రాజేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు, రంగ నాథ్, హరనాథ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిసిలకు మొండి చెయ్యి!

గూడూరులో నారగోని విమర్శ

రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం ఏర్పడిందని, ప్రభుత్వ పథకాలేవి అమలు కావడం లేదని బిసి ఐక్య సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు విజిఆర్ నారగోని వ్యాఖ్యానించారు. గూడూరు వచ్చిన ఆయన స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వంలో పలు సంక్షేమ పథకాలు కుంటుపడ్డాయన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని, ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తికాక నిలచిపోయినవి అధికంగా వున్నాయన్నారు. బిసిలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫెడరేషన్ నిధులు లేక నీరసించి పోతోందన్నారు. బిసి విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులు విడుదల కావడం లేదని, ప్రభుత్వం అన్ని విధాలా బిసిలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీలు కల్లబొల్లి మాటలు చెప్పడం తప్ప బిసిల అభ్యున్నతికి ఏ పార్టీ కృషి చేయడంలేదన్నారు. బిసిలను అభివృద్ధి పరచి, బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు.



క్రిస్టమస్ సందర్భంగా పేదలకు వస్త్రదానం చేస్తున్న కాంగ్రెస్ ఎస్సీసెల్ నాయకుడు బాలసుధాకర్.

అబందరగా ఫించన్ల పంపిణీ!

బోగోలులో ఎప్పుడిస్తారో తెలియదు.

బోగోలు మండలంలో ఫించన్ల పంపిణీ అబందరగా మారింది. ప్రతి నెలా ఒకటో తారీఖున అందాల్సిన పెన్షన్లు పదకొండో తారీఖుకు వచ్చేవి. అవి కూడా అందకుండా పోతుండడంతో ఫించనుదారులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూపులు చూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రతి గ్రామంలో ఇదే తంతు. పొద్దుటి నుంచి మధ్యాహ్నం వరకు అధికారులు వచ్చి పెన్షన్లు ఇస్తారని ఎదురు చూడడం, నిరాశతో వెనుదిరగడం గత మూడు నెలలుగా బోగోలు మండలంలో జరుగుతున్న తీరు. వికలాంగులు, వృద్ధులకు అందజేసే ఫించన్ల పంపిణీ అస్తవ్యస్తంగా మారడంతో పేదలు అల్లాడిపోతున్నారు. కూలి పనులు మానుకొని ఫించన్ల కోసం ఎదురు చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారుల చుట్టూ తిరిగి సమస్య చెప్పుకొన్నా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మండలంలోని ఫించనుదారులు. శాసనసభ్యులైనా ఈ సమస్యను పరిష్కరించి సక్రమంగా ఫించను అందేలా చూడాలని వేడుకొంటున్నారు వారు.

బ్యాంకుల దగ్గర

కాపుకాస్తున్న దొంగలు!

నగలు తాకట్టుపెట్టి అయినా రుణం పొందుదామని ఆశపడి బ్యాంకుకు వెళ్లిన రైతు నగలు మాయం కావడం నాయుడుపేటలో చోటు చేసుకొంది. పెళ్లకూరు మండలం కానూరు రాజుపాళెం గ్రామానికి చెందిన చంద్ర రాజు పంటను కాపాడుకొనేందుకు విధిలేని పరిస్థితుల్లో నగలు తాకట్టు పెట్టి రుణం పొందేందుకు ప్రముఖ బ్యాంకుకు వచ్చాడు. అక్కడ అధికారులతో మాట్లాడి సంబంధిత పత్రాలపై సంతకాలు చేసిన అనంతరం మేనేజర్ వద్దకు పోయి వేచి చూస్తుండగా నగలు వుంచిన కవరు మాయమయ్యింది. దీంతో దిక్కుతోచని ఆ రైతు అధికారులకు విషయం వివరించగా గేటుకు తాళాలు వేసి వెతికించినా ఫలితం లేకుండా పోయింది. పంట రుణం తీసుకొనేందుకు వచ్చిన ఆ రైతు ఈ సంఘటనతో లబోదిబో మంటున్నాడు. ప్రభుత్వం కౌలు రైతులను పట్టించుకోవడం లేదని, దీని ఫలితంగా నగలు తాకట్టు పెట్టి రుణం పొందాలనుకొన్నా బ్యాంకు వద్ద ఇలాంటి ఘటనలు జరుగుతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. నగలు పోయిన విషయంపై బ్యాంకు సిబ్బందే బాధ్యత వహించాలని, న్యాయం చేయాలని కోరుతున్నాడు బాధితుడు. మొత్తం మీద ఈ వ్యవహారం కలకలం రేపింది.

జిల్లా అంతటా ఇదే పరిస్థితి

• వైద్య ఆరోగ్యశాఖ

సిబ్బంది పని తీరు మారాలి!



ఇప్పటికైనా పద్ధతి మార్చుకోండి లేదంటే ఇకపై చెప్పేది వుండదు అంటూ డిఎంహెచ్‌ఓ మాసిలామణి వైద్యులకు హెచ్చరికలు జారీ చేశారు. బుచ్చి ప్రభుత్వ ఆస్పత్రిని ఇటీవల ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంతో ఘనచరిత్ర గల ఇక్కడి ఆస్పత్రికి గతంలో రోజుకు 400 మందికిపైగా రోగులు వచ్చేవారని, నేడు పదిమంది కూడా రావడం లేదంటే మీరు ఎంత బాగా వైద్యసేవలు అందిస్తున్నారో అర్థమవుతుందని వ్యాఖ్యానించారాయన. ఎంతో పేరు గల ఆస్పత్రిని భ్రష్టుపట్టించారంటూ వైద్యాధికారులు, సిబ్బందిపై మండిపడ్డారు. నర్సులు కొందరు యూనిఫాం

బుచ్చిలో డిఎంఅండ్‌హెచ్‌ఓ

లేకుండా ఆలస్యంగా ఆస్పత్రికి రావడాన్ని గమనించిన ఆయన వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్యూటీకి వచ్చారా లేక ఫ్యాషన్ షోకు వచ్చారా అని ప్రశ్నించారు. మండలంలో ధనుర్వాతం కేసు నమోదైనందున జాగ్రత్తగా వ్యవహరించాలని, మరో కేసు నమోదైతే బాధ్యులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. నెలకు వంద కాన్పులు చేయాల్సి వుండగా ఒక్క కాన్పు కాలేదంటే సిబ్బంది ఎంతబాగా విధులు నిర్వహిస్తున్నారో తెలుస్తుందంటూ మండిపడ్డారు. ఆస్పత్రి పరిసరాలు అపరిశుభ్రంగా వుండడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగాలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు కొత్త రోగాలు రాకుండా చూడండి అని చురక అంటించారు. ఆస్పత్రిలో వైద్యసేవలకు ప్రాధాన్యమివ్వండి మరోసారి ఇలా జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.

ఇస్కపాళెం పోస్టాఫీసు స్వాహా!

సస్పెన్షన్‌తో ఎవరికి మేలు?

అవసరానికి ఉపయోగపడతాయని పోస్టాఫీసు పొదుపు ఖాతాల్లో దాచుకున్న డబ్బును సిబ్బందే దిగమింగితే, ఆ మొత్తాలను ఖాతాదారులకు తిరిగి జమ చేసే విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. బుచ్చి మండలం సబ్ పోస్టాఫీసు క్రింద గల ఇసుకపాళెంలో పేద, మధ్యతరగతి ప్రజలు సేవింగ్స్ ఖాతాలు తెరచి డిపాజిట్లు కట్టారు. అయితే ఇక్కడ బ్రాంచి పోస్టుమాస్టర్ ఆ పైకాన్ని కేవలం పుస్తకాలలో మాత్రం వ్రాసి డబ్బులు అకౌంట్‌లో జమ చేయకుండా లక్షలాది రూపాయలు స్వాహా చేశాడట. ఈ వ్యవహారంపై గగ్గోలు రేగడంతో పోస్టల్ అధికారులు విచారణ జరిపి ఆ పోస్టుమాస్టర్‌ను సస్పెండ్ చేసి చేతులు దులుపుకొన్నారు తప్ప డిపాజిట్ సొమ్ము తిరిగి ఇవ్వడంపై స్పందించకపోవడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రశీదులు పారేయకుండా పెట్టుకోమని సలహా ఇవ్వడం తప్ప, కష్ట పడి, చెమటోడ్చి సంపాదించి దాచుకున్న డబ్బుల మాటే అనుకోవడం లేదని వారు వాపోతున్నారు. తపాలాశాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరుకొంటున్నారు గ్రామస్తులు.

బియ్యం కావాలంటే పుచ్చిన పప్పుకొనాలి!

రేషన్ డీలర్ల మెలిక

సాధారణంగా కంపెనీలు వినియోగదారులకు ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. ఒకటి కొంటే మరొకటి ఉచితం అని చెప్తుంటాయి. దీనికి భిన్నంగా వుంది బోగోలు మండలంలోని రేషన్‌షాపు నిర్వాహకులది. ప్రభుత్వం పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ప్రవేశపెట్టిన రూపాయికి కిలో బియ్యం పథకం ద్వారా అందించే బియ్యం ఇవ్వాలంటే కందిపప్పు, మినపప్పు కొనాలని చెప్తుండడంతో పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రూపాయితో కేజి బియ్యం వస్తే తిండికి ఇబ్బంది వుండదని అనుకొనే పేదలు రేషన్ డీలర్ల వైఖరితో అల్లాడిపోతున్నారు. కందిపప్పు, ఇతర వస్తువులను కొంటేనే రూపాయి బియ్యం ఇస్తామని లేదంటే ఇవ్వమని దబాయిస్తుండడంతో కన్నీళ్ల పర్యంతం అవుతూ అవి కొనలేక ప్రభుత్వం ఇచ్చే బియ్యాన్ని వదులుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు వినియోగదారులు. దీనిపై రేషన్ డీలర్లను ప్రశ్నిస్తే మాకు తహశీల్దార్ కందిపప్పుకు డిడి కడితేనే బియ్యం ఇస్తామంటున్నందున మేము అదే పని చేస్తున్నామని బదులిస్తున్నారు. ఆ కందిపప్పు అన్నా బాగుంటుందా అంటే అది పురుగుపట్టి వాసన వస్తోందని, అది తింటే వాంతులు, విరోచనాలు అవుతున్నాయని పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. మొత్తం మీద రేషన్ డీలర్ల పుణ్యమా అని బోగోలు మండలంలో తెల్లకార్డు గల వారు ప్రభుత్వం రుపాయికి ఇచ్చే బియ్యాన్ని పొందలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

బల్లవోలు డ్రెయిన్‌తో రైతుల ఇక్కట్లు!

ఆధునీకరణ పనులెప్పుడో?

చిల్లకూరు మండలం బల్లవోలు మురుగుకాలువ, ఐదారు గ్రామాల రైతుల పాలిట శాపంగా మారుతున్నది. కోట మండలంలోని పెన్నక్క చెరువు నుంచి వచ్చే మురుగునీరు ఉప్పుకాలువకు చేర్చే డ్రెయిన్ ఇది. దారి పొడవునా వుండే సొన కాలువలను కూడా ఇది తనలో కలుపు కొంటుంది. ఈ ప్రాంతంలో రొయ్యల చెరువులు సాగు చేసే రైతులు ఈ డ్రెయిన్‌ను ఆక్రమించారు. దానితో ఉప్పు కాలువలో కలిసే మార్గం లేక మురుగునీరు ఎగదన్నుతుంది. దాని ఫలితంగా బల్లవోలు, చింతవరం, రాళ్లపాళెం, కాకువానిపాళెం, పల్లమాల తదితర గ్రామాలలో పంట పొలాలు చిత్తడి నేలలుగా మారుతున్నాయి. కయ్యలో ఎప్పుడూ నీరు నిల్వ వుండడంతో పైర్లు సాగు చేయలేకపోతున్నారు. ఎండాకాలం వస్తే కాని, నాట్లు వేయలేకపోతున్నారు. అప్పటికి సొన కాలువలు ఎండిపోయి పైరుకు నీరందడం లేదు. దానితో ఈ ఐదారు గ్రామాల రైతులూ నరక యాతన అనుభవిస్తున్నారు.

2007 సంవత్సరంలో చింతవరం వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి దృష్టికి ఈ విషయం తీసుక వెళ్లడం జరిగింది. ఆయన వెంటనే స్పందించి డ్రెయిన్ పూడిక తీయడానికి కోటి 65 లక్షల రూపాయలు మంజూరు చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ పని ముందుకు సాగడం లేదు. రైతులు ఏళ్ల తరబడి పంట పండించుకోను నానా యాతన పడ్తున్నారు. కలెక్టర్ గారు, స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంలో శ్రద్ధ పెట్టడం అవసరం.

బ్రాహ్మణ
వివాహ సంబంధాలకు
: సంప్రదించండి :
Ph : 0861 - 6527494
email : svsmarriagelinks@live.com

సమస్యలపై నిలదీస్తాం!



● శాసనమండలి సభ్యుడు శ్రీనివాసులురెడ్డి

రాష్ట్రంలో విద్యారంగానికి సంబంధించిన పలు సమస్యలపై చట్టసభల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని శాసనమండలి సభ్యుడు యండ్రపల్లి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. వెంకటగిరిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 731 ఆదర్శ పాఠశాలల ఏర్పాటును తాము ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో టీచర్లు లేరని దీని వల్ల ప్రభుత్వ ఉద్దేశం దెబ్బతినే ప్రమాదమున్నందున టీచర్ల నియామకం చేపట్టాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో తమిళనాడు రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాలను ఇక్కడ అమలు చేస్తే బాగుంటుందన్నారు. ప్రత్యేకించి ఉపాధ్యాయుల అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌పై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

అభివృద్ధికి నోచుకోని పల్లెలు!

చిల్లకూరు మండలంలో బోలెడు

చిల్లకూరు మండలంలో పలు పరిశ్రమల రాకతో అభివృద్ధి జరుగుతుంటే మరోవైపు అదే మండలంలోని ఇతర ప్రాంతాల్లో మాత్రం అభివృద్ధి అనే మాట విన్పించనంత దూరంగా, ప్రభుత్వ పథకాలు అందక దుర్భర జీవితం గడుపుతున్నారు ప్రజలు. రావులవారిపాళెం, పోసినవారిపాళెం గ్రామాన్ని పరిశీలించినట్లయితే ఈ నిజం వెల్లడవుతుంది. సిమెంటురోడ్డు, తారురోడ్డు మాట దేవుడెరుగు కనీసం మట్టి రోడ్డు కూడా లేకపోవడంతో ఆ గ్రామాలకు వెళ్లాలంటేనే ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ రెండు గ్రామాలు బకింగ్ హామ్ కెనాల్‌కు అవతలివైపు వున్నాయి. షుమారు అరవైకి పైగా కుటుంబాలు నివసిస్తున్న ఈ ప్రాంతంలోని వారందరూ గౌడ కులస్తులు. వీరిలో అధిక భాగం కులవృత్తి అయిన కల్లుగీత పైనే ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వీరికి తెలియవు. ఎలాంటి అభివృద్ధికి నోచుకోక, ఎలాంటి పథకాలు దరిచేరక, త్రాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కరువై అనామకంగా జీవిస్తున్నారు ఈ ప్రాంత ప్రజలు. ఎన్నికలప్పుడు మాత్రం కెనాల్ దాటి వచ్చి ఓట్లు అభ్యర్థించే నేతలకు ఆ తర్వాత మాత్రం వీరి బాగోగులు పట్టవు. గ్రామంలో పాఠశాల వున్నా కాలువ దాటి రావాల్సి వుండడంతో ఉపాధ్యాయులు వచ్చి పాఠాలు చెప్పే పరిస్థితి లేదు. అత్యవసర సమయాలు, అపద సంభవించినపుడు తక్షణ సహాయం పొందేందుకు ఆస్కారం లేదు. గ్రామానికి కనీస సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఈ ప్రాంత ప్రజలు ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టు తిరిగినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.

కుచేలునిగా చెన్నకేశవస్వామి!

ఆస్తులుండి ఏమి లాభం?

నాయుడుపేట మండలం జువ్వలపాళెం గ్రామంలో గల పురాతన చెన్నకేశవస్వామి ఆలయ మాన్యం వ్యవహారమై తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి. కొందరు పెత్తందార్లు దేవుడి భూములను సాగు చేసుకొంటూ కౌలు చెల్లించడంలేదని, ఈ కారణంగా ఆస్తులున్నా చెన్నకేశవునికి ధూప దీప నైవేద్యాలకు కరవవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఆలయానికి గ్రామంలో 3.16 ఎకరాల భూమి వుంది. ఈ భూములు ఏళ్ల తరబడి వేలం పాటలకు నోచుకోకపోవడంతో గ్రామస్తులు తీవ్ర నిరసన తెలిపారు. దేవాదాయశాఖ అధికారులను దీనిపై నిలదీయడంతో తూతూమంత్రంగా వేలం పాటలు నిర్వహించి చేతులు దులుపుకొన్నారు తప్ప ఆ మొత్తం సక్రమంగా ఖాతాలో జమ అయ్యేలా చూడక పోవడంతో మూడు సంవత్సరాలపాటు భూములను సాగు చేసుకొనే అధికారాన్ని వేలంలో దక్కించుకొన్న వ్యక్తులు ఆ మొత్తం చెల్లించడంలేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఒక్క పైసా దేవుడి ఖాతాలో జమకాకపోయినా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహిస్తున్నారు. గతంలో ఎప్పుడో కొంత మొత్తం చెల్లించిన సాగుదారులు ఆ తర్వాత ఆ మాటే అనుకోలేదని దీంతో డబ్బులేక ఆలయ నిర్వహణ కష్టంగా మారిందని, దేవుడికి దీపం వెలిగించే దిక్కుకూడా లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసాంఘిక శక్తుల వీర విహారం!

కావలిలో శాంతిభద్రతల పరిస్థితి ఘోరం

గత కొంతకాలంగా ప్రశాంతంగా వుండే కావలి పట్టణం ఇటీవల తిరిగి అసాంఘిక శక్తులకు నిలయంగా మారుతోంది. మహిళలపై అఘాయిత్యాలు, కిడ్నాప్‌లు, దాడులు, దొంగతనాలు, హత్యలతో పట్టణంలో అలజడి నెలకొంటోంది. ఇటీవల జరుగుతున్న ఇలాంటి ఘటనలను పరిశీలిస్తే ఇది అర్థమవుతుంది. గతంలో ఒక మహిళా లాయర్‌పై దాడి, ఉన్మాది అఘాయిత్యాలు, దొంగతనాలతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా వుండింది. ఇటీవల మహిళలను కిడ్నాప్ చేసేందుకు యత్నించడంతో పట్టణంలో ఒంటరిగా తిరగాలంటేనే హడలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. వివిధ ప్రాంతాలలో అల్లరి మూకలు, ఆటోవాలాల ముసుగులో అసాంఘిక శక్తులు, దొంగలు, దోపిడీదారులు సంచరిస్తూ ఇలాంటి వాటికి పాల్పడుతున్నా పోలీసులు తగిన విధంగా పటిష్టమైన చర్యలు చేపట్టకపోతుండడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రౌడీ మూకలు, అల్లరిచిల్లరిగా తిరిగే వ్యక్తులు, నేరస్తులపై తగిన నిఘా పెట్టకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు జరిగేందుకు కారణమవుతున్నాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల తుపాన్ నగర్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి హత్యకు గురికావడం శాంతిభద్రతలు ఎంతగా క్షీణించాయో తేటతెల్లం చేస్తోంది. కావలి పోలీస్ మాత్రం మనీస్కీం సొమ్ము బొక్కేయడంలో వున్న శ్రద్ధ వీటిపై పెట్టడం లేదు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కావలిలో శాంతిభద్రతలను కాపాడి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుకొంటున్నారు స్థానికులు.

పొట్టేపాళెం రీచ్ నుంచి ఇసుక అక్రమ రవాణా!

● నెల్లూరు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న పొట్టేపాళెం పొర్లుకట్ట నుంచి ప్రతి రాత్రి తొమ్మిది గంటల నుంచి తెల్లవారు ఝామున నాలుగు గంటల వరకు ఇసుక అక్రమ రవాణా యదేచ్ఛగా జరిగిపోతూంది.



పొట్టేపాళెం రీచ్ నుంచి అక్రమంగా ట్రాక్టర్లకు ఎత్తుతున్న ఇసుక.

నెల్లూరు జిల్లా ఇసుక మాఫియాకు నిలయంగా మారుతున్నది. పెన్న, స్వర్ణముఖి నదులు ఈ అక్రమ వ్యాపారులకు బంగారు గనులుగా ఉపయోగపడు న్నాయి. ఎమ్మెల్యేలకు, ఇతర రాజకీయవాదులకు ఇం దులో వాటాలున్నాయి. జాయింట్ కలెక్టర్, మైనింగ్, రెవిన్యూ, పోలీసు, పంచాయితీ విభాగాల అధికారుల జేబులు నిండిపోతున్నాయి. ఎవరి వాటా వారికి ముడు తుండడంతో అందరూ కతక్కన కళ్లు మూసేస్తున్నారు. పొరపాటున ఏ అధికారి అయినా ఆ మాఫియా జోలికి వెళ్లడానికి ప్రయత్నిస్తే ఎమ్మెల్యేలు కళ్లు ఎర్రన చేస్తున్నారు. గ్రుడ్లురుముతున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు ప్రత్యక్ష నిదర్శనం పొట్టేపాళెం గ్రామం. ఇక్కడి పొర్లుకట్ట సమీపంలో పెన్నానది నుంచి రాత్రి సమయంలో భారీ ఎత్తున అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోంది. చీకటి పడ గానే పొక్లెయిన్‌లు, లారీలు పెన్నలోకి వచ్చేస్తాయి. వందలాది లారీలు, ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తారు. తెల్లవారేసరికి ఆ వాహనాలన్నీ అదృశ్యమైపోతాయి. ఒక పథకం ప్రకారం జరిగిపోతున్నదీ అక్రమ వ్యాపా రం. దాని విలువ – లక్షలు కావు – కోట్ల రూపా యలు. పొట్టేపాళానికి చెందిన ఓ వ్యక్తి తానే వేలం పాట దారుడినన్న విధంగా వ్యవహరిస్తూ ఎటువంటి బిల్లులు, రశీదులు లేకుండానే ఈ వ్యాపారం కొనసా గిస్తున్నాడు. ఒక్కో ట్రాక్టర్ నుంచి వెయ్యి రూపాయల వంతున వసూలు చేస్తున్నాడు. ఇలా వసూలు చేసిన మొత్తంలో పోలీసులు, గ్రామ రెవెన్యూ, పంచాయితీ అధికారులకు నెలసరి మామూళ్లు అందిస్తున్నాడు.

ఆ దొంగ సొమ్ము మరిగిన అధికారులు అక్ర మంగా తరలిస్తున్న ఇసుక గురించి పట్టించుకోవడం మానేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమ తరలింపు కోసం పెన్నానది పొర్లుకట్ట కొంత భాగం తొలగించి రహదారి ఏర్పాటు చేశారు. పొర్లు కట్టను తొలగించడంతో ఇక్కడ నివాసం వున్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద వస్తే గ్రామం ముంపుకు గురౌతుం దని భయపడుతున్నారు. ఇలా చేయడాన్ని ప్రశ్నించిన వారిపై ఇసుక వ్యాపారులు దౌర్జన్యానికి దిగి భయపె డుతున్నట్లు స్థానికులు కొందరు ఆవేదన వ్యక్తం చేశారు.

అనుమతి లేని రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుక తరలించడం నేరమైనప్పటికీ అధికారయంత్రాంగం స్పందించక పోవడంతో అక్రమ రవాణాదారులకు అడ్డూ ఆపు లేకుండా పోయింది. రాత్రి సమయంలో అధిక సంఖ్యలో వాహనాలు తిరగడం కారణంగా రహదారి పూర్తిగా దెబ్బతిని పోయింది. స్థానికులు ఈ ప్రాంతంలో ఉన్న కొందరు వామపక్ష పార్టీల నేతల దృష్టికి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న విషయాన్ని తీసుకెళ్లారు. వీరిలో కొందరు లేఅవుట్లు వేసిన ప్లాట్లకు ఉచితంగా ఇసుక సరఫరా చేసే విధంగా అక్రమ రవాణాదారులతో ఒప్పందం చేసుకు న్నారన్న ప్రచారం జరుగుతుంది. అక్రమ రవాణా అడ్డుకోలేక పోవడంతో స్థానికులు ఎవరికి విన్నవిం చుకోవాలో తెలియక సతమతమవుతున్నారు.

ప్రభుత్వం నుంచి తీవ్రమైన ఒత్తిడి వస్తేనే తప్ప భూగర్భ గనులు, విజిలెన్స్ అధికారులు స్పందించని పరిస్థితి. ఇసుక అక్రమ రవాణాను రెవెన్యూ, పోలీ సులు అడ్డుకునే అవకాశం ఉన్నప్పటికీ మామూళ్లు, రాజకీయ నేతల ఒత్తిడితో ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ స్పం దించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అడిగేవాడొకడొచ్చాడు!



నెల్లూరు నగరంలో జరుగుతున్న భూ ఆక్రమణ లపై మూడో కన్ను తెరి చాడు తిరుపతి పార్లమెంటు సభ్యుడు చింతా మోహన్. 3వ తేది కలెక్టరేట్‌లో జరు గుతున్న రెవిన్యూ అధికా రుల సమావేశానికి పిల వని పేరంటంగా వచ్చిన ఆయన తన గీతోపదేశంతో కలెక్టర్‌తో సహా అంద రికీ చెమటలు పట్టించాడు. "నెల్లూరు నగరంలో జరు గుతున్నదేమిటి? జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కనుపర్తిపాడు చెరువును రియల్ ఎస్టేట్ లేఅవుట్‌గా మార్చి ఇళ్ల స్థలాలుగా అమ్ముకొంటుంటే మీరేమి చేస్తు న్నారు? చెరువులను ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చే అధి కారం ప్రధానమంత్రికి కూడా లేదని మీకు తెలి యదా? అంత బహిరంగంగా ప్రభుత్వ ఆస్తుల దోపిడీ జరుగుతుంటే మీరంతా కళ్లు మూసుకోవడంలో ఉద్దే శం ఏమిటి? రాజకీయ పలుకుబడి కలిగిన వ్యాపారు లకు మీరిట్లా వత్తాసు పలికితే నేను చూస్తూ ఊరు కోను. నా నియోజకవర్గంలోని చెరువులన్నింటినీ లే అవుట్లుగా మార్చి, పేద ప్రజలకు పంపకం చేస్తాను. అప్పుడు మీరెట్లా అడ్డువస్తారో చూస్తాను. డబ్బు, పలు కుబడి కల్గిన వారికి ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయం అన్నది మీ విధానమా? ఇప్పటికైనా పద్ధతి మార్చుకోండి. అక్రమాలను నిష్పక్షపాతంగా అడ్డు కోండి. లేదంటే మీ భరతం పట్టవలసి వస్తుంది" అని చెప్పి సమావేశం నుంచి నిష్క్రమించాడు చింతా మోహన్. రెవిన్యూ అధికారులకు ఆయన మాట తీరు చూసి చొక్కాలు, ప్యాంట్లు తడిచి పోయాయి.

రాజకీయ దోపిడీని, అధికారుల లాలూచీని ఇంత నిర్భయంగా, ఇంత నిక్కచ్చిగా, ఇంత నిర్మొగ మాటంగా అడిగేవాడు, ప్రశ్నించేవాడు లేకనే నెల్లూరు నగరం ఆటవిక పాలనకు ఆవాసంగా మారుతున్నది. జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆయన సోదరుడు వివేకానందరెడ్డి కలసి నెల్లూరును పిండా రీలు, దగ్గులకంటే హీనంగా దోచుకొంటున్నారు. వం దల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలను దురాక్రమిస్తున్నారు. చింతామోహన్ ప్రస్తావించిన కనుపర్తిపాడు చెరువు విలువ 150 కోట్ల పైమాటే. మునిసిపల్ మాస్టర్ ప్లాన్‌లో అది భవిష్యత్తు ఆర్‌టిసి బస్టాండ్ స్థలంగా చూపించి ఉంది. అది ప్రభుత్వ స్థలమని ఎమ్మార్వో, ఆర్డీఓలు ఇద్దరూ తేల్చి చెప్పారు. కానీ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి దౌర్జన్యంగా దాన్ని లేఅవుట్ చేసి స్థలాలు అమ్మిస్తున్నాడు. అడ్డంపోయిన ఆర్డీఓను గద్దిస్తున్నాడు. ఈ దుర్మార్గవైఖరిని నిలువ రించవలసింది కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వంటి ఉన్నత అధికారులు. కానీ వారికి వివేకానందరెడ్డి గొంతు వింటే ప్యాంట్లు తడుస్తాయి. ఆ అన్నాతమ్ముళ్ల ముందు బానిసలుగా మెలగడం అలవాటు చేసుకొన్న బలహీనులు ఆ ఇద్దరు అధికారులు. అందువల్లనే నెల్లూరు టౌన్‌లో కానీ, చుట్టుప్రక్కల మండలాలలో కానీ ప్రభుత్వ స్థలాల దురాక్రమణ యదేచ్ఛగా జరిగి పోతున్నది. పత్రికలు గోల పెట్టడం తప్ప ఇంత కాలం ఈ దురన్యాయాన్ని ప్రశ్నించిన వాడు లేడు. తెలుగుదేశం, సిపిఎం, సిపిఐ, బిజెపి వంటి ప్రతి పక్షాలన్నీ ఏదో ఒక కారణంతో ఆనం సోదరులకు గులాంగిరి చేస్తున్నాయి. దానితో తమను అడిగే వారు లేరన్న ధైర్యం తెచ్చుకొని మరింత బరితెగించి ప్రవర్తిస్తున్నారు అటు అధికారులు, ఇటు ఎమ్మెల్యే అనుచరులు. ఇప్పుడు చింతా మోహన్ తన గొంతు విప్పాడు. ఒక సీనియర్ ప్రజాప్రతినిధి తమను నిల దీసిన తర్వాత అయినా అధికారులలో చలనం వస్తుందో లేదో వేచి చూడాలి. ఏది ఏమైనా చింతా మోహన్ మంచి పని చేశాడు. జిల్లాలో జరిగే అన్ని అన్యాయాల పట్ల ఆయన ఇదే నిర్మొగమాట వైఖరి అనుసరిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.





బొత్సకు కోపమొచ్చిందోచ్!!


పిసిసి చీఫ్ బొత్సా సత్యనారాయణకు కోపమొచ్చింది. చిరు వర్గాన్ని మంత్రి వర్గంలో చేర్చుకోకుండా కిరణ్ అధిష్టానంను ఒప్పించడం బొత్సా కోపానికి కారణమట. త్వరలో జరుగనున్న ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాకర్షణ కలిగిన చిరంజీవి సేవలు పొందడానికి, ఆయన వర్గీయులకు మంత్రి పదవులు ఇప్పించడం అవసరమని బొత్సా భావించాడు. అయితే ఇప్పట్లో మంత్రి వర్గం మార్పులు చేస్తే తేనెతుట్టెను కదిపినట్లు అవుతుందన్నది కిరణ్ అభిప్రాయం. అందుకే ఎన్నికల తర్వాత విస్తరణ చేయాలని భావిస్తున్నాడు. ప్రస్తుతం విస్తరణ చేయడం వల్ల కలిగే అనర్థాల్ని కిరణ్ క్లియర్‌గా అధిష్టానానికి చెప్పగలిగాడు. దీంతో బొత్సా మాటకు విలువ లేకుండాపోయింది. ఒక రకంగా అధిష్టానం వద్ద సిఎంకు పట్టు వుందన్న సంగతి దీంతో తేలిపోయింది. ఇప్పటిదాకా ఢిల్లీలో చక్రం తిప్పుతున్న బొత్సాకు కిరణ్ వైఖరి మనస్తాపం కలిగించింది. అదీగాక తనతో మాట మాత్రం కూడా చెప్పకుండా నామినేటెడ్ పోస్టుల్ని భర్తీ చేస్తామంటూ కిరణ్ ప్రకటన చేయడాన్ని కూడా బొత్సా జీర్ణించుకోలేక పోతున్నాడట. కిరణ్ రూపాయి కిలోబియ్యం, లక్ష ఉద్యోగాలు వంటి ప్రజాకర్షక పథకాల్ని ఏకపక్షంగా అమలు చేయడం కూడా బొత్సాకు కోపం తెప్పించిందన్నది గాంధీభవన్ వర్గాల ఉవాచ.

ఉప ఎన్నికలకు పదవుల పాచిక



రాష్ట్రంలో త్వరలో జరుగనున్న ఉప ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం నామినేటెడ్ పోస్టుల్ని ఎరగా వేయాలని సిఎం కిరణ్ నిర్ణయించాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకటీ అరాతప్ప నామినేటెడ్ పోస్టుల నియామకం జరగలేదు. రోశయ్య సిఎంగా వున్నప్పుడు నామినేటెడ్ పోస్టుల నియామకం ప్రక్రియకు శ్రీకారం చుట్టినా దాన్ని ముందుకు తీసుకపోలేకపోయారు. ఆతర్వాత కిరణ్ సిఎం అయ్యారు. సిఎం కుర్చీ ఎక్కి ఏడాది గడుస్తున్నా నామినేటెడ్ పోస్టుల జోలికి పోలేదు. దీంతో కాంగ్రెస్ క్యాడర్‌లో తీవ్ర అసంతృప్తి వల్ల నష్టం కలగకుండా వుండేందుకు కిరణ్ తాజాగా నామినేటెడ్ పోస్టుల నియామకాలకు తెర లేపారు. అయితే ఎప్పుడు ఈ పోస్టుల్ని భర్తీ చేస్తారన్న దానిపై మాత్రం కిరణ్ నోరుమెదపడం లేదు. అయితే ఉప ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇస్తామని చెబుతున్నాడు. దీంతో నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్నవారంతా క్రియాశీలకంగా కనిపించేందుకు రోజూ గాంధీభవన్, సిఎం పేషీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

వెండితెరపై చారి ఐఎఎస్



ఇటీవలే స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన సీనియర్ ఐఎఎస్ రమణాచారి ఇక వెండితెరపై నటుడిగా కన్పించనున్నాడు. సర్వీసులో వుండగానే దేవాలయం అనే సినిమాలో ఓ వేషం వేశాడు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. కాగా ఇకమీదట సినిమా రంగంపై దృష్టి పెట్టాలని చారి నిర్ణయించాడట. శంకరాభరణం స్థాయిలో ఓ సినిమా నిర్మాణానికి కూడా చారి నడుం కడుతున్నట్లు భోగట్టా. ఈ సినిమాలో ప్రధాన పాత్రలో రమణాచారి కనిపిస్తాడట. చారి తీసే సినిమాకు 'బాపు'ను దర్శకుడిగా పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఐఎఎస్ అధికారిగా వివిధశాఖల్లో పనిచేసిన రమణాచారికి అటు సినీ రంగంతోను, ఇటు నాటక రంగంతోనూ పరిచయముంది. రాష్ట్రంలోని వివిధ సాంస్కృతిక సంఘాలతో సన్నిహిత సంబంధాలున్నాయి. వీటన్నింటితోపాటు స్వతహాగా సాహితీ ప్రియుడైన రమణాచారి ఆ మధ్య 'పద్య కవిత్వం'పై పరిశోధన చేసి డాక్టరేటు కూడా తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో శేషజీవితాన్ని వెండి తెరకు అంకితం చేయాలని చారి నిర్ణయించుకున్నాడట. సో... వెండితెరకు మరో క్యారెక్టర్ నటుడు దొరికాడన్న మాట!!


జగన్ వర్గంలో గుబులు



వైఎస్ఆర్ ఆస్థాన ఆడిటర్ విజయసాయిరెడ్డి అరెస్టుతో జగన్ వర్గంలో గుబులు మొదలైంది. జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో విజయసాయిరెడ్డి రెండో ముద్దాయి. జగన్ మొదటి ముద్దాయి. విజయసాయిరెడ్డి అరెస్టు తర్వాత జగన్‌ను జైలుకు పంపడం ఖాయమంటూ జరుగుతున్న ప్రచారంతో వైఎస్ఆర్ పార్టీ వర్గాలు విషాదంలో మునిగిపోయాయి. జగన్ మాత్రం క్యాడర్‌ను ఉత్సాహపరచడానికి ఓదార్పు యాత్రతో పాటు, ఫీజుపోరంటూ ఆందోళనా కార్యక్రమాలతో బిజీగా వున్నాడు. తెలంగాణలో తమపార్టీ పోటీ చేయదంటూ జగన్ చేసిన ప్రకటన పట్ల కూడా ఆపార్టీ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. జగన్ నిర్ణయం యుద్ధానికి ముందే అస్త్రసన్యాసం చేసినట్లుందంటూ పార్టీ వర్గాలు పెదవి విరుస్తున్నాయి.


ట్రంకురోడ్డు కబుర్లు

వాళ్లు మేనమామలు!



మెగాస్టార్ చిరంజీవి ఇప్పటివరకు 149 సినిమాల్లో పలు పాత్రలు పోషించారు. రాజకీయాల్లోకి వచ్చాక కొత్త చుట్టరికాలు కలుపుతూ తానేం తక్కువ కాదని నిరూపించారు. గతవారం నెల్లూరు పర్యటనకు వచ్చిన చిరంజీవి బహిరంగ సభలో మాట్లాడుతూ తన తల్లి పుట్టినూరు నెల్లూరు కాబట్టి ఇక్కడ రాజకీయం చేసే ఆనం సోదరులు మేనమామలని సంభోదించడంతో పెద్ద దుమారం రేగింది. ఇదేమి బాదరాయణ సంబంధమో అర్థంగాక మెగాస్టార్ అభిమానులు తలలు పట్టుకొంటుండగా ఆనం వివేకానందరెడ్డి మాత్రం తనదైన ధోరణిలో దరహాసం చేస్తున్నారు.

నిశ్శబ్దంగా పార్టీ మారిన విష్ణు!



అధికారం కోసం... పదవుల కోసం పార్టీలు మారడం నేతలకు అలవాటు. కాని గత పాతికేళ్లుగా కాంగ్రెస్ పార్టీని మారకుండా వుండిన అల్లూరు మాజీ ఎమ్మెల్యే అకస్మాత్తుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వేరొకరిని ప్రకటించడంతో అక్కడ వుండలేక బయటకు వచ్చేశారు. విష్ణు పార్టీ మారడంపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చురకలు అంటించినా మరో మార్గాంతరం లేని విష్ణు కావలి పర్యటనలో రామనారాయణ రెడ్డి ప్రక్కన కూర్చొని పత్రికలకు ఫోజులిచ్చారు. మళ్లీ విష్ణు కాంగ్రెస్ గూటికి చేరడంపై వాడివేడి చర్చ జరుగుతోంది.

శీనయ్య వ్రాతలపై సున్నం!



నెల్లూరులో ఆనం సోదరులు, వారి అనంగు అనుచరులు, వారి నేతృత్వంలో నడిచే సంస్థలపై వ్యతిరేక ప్రచారాన్ని భరించలేరు. ఏదో ఒకరకంగా వ్యతిరేక ప్రచారాన్ని అడ్డుకోవడం వారికి వెన్నతో పెట్టిన విద్య. ఆనమీయులపై అలుపెరుగక పోరాటం చేస్తున్న తెలుగుదేశం నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి నెల్లూరు కార్పొరేషన్‌లో విపరీతంగా పెంచేసిన ఇంటి పన్నులపై వాల్ రైటింగ్ ప్రారంభించారు. వారం రోజులు ఈ విషయం వివేకానందరెడ్డికి తెలియలేదేమో గమ్మునుండినారు. ఈ వారం శీనయ్యను చెడామడా తిడుతూ ఓ విలేకరుల సమావేశం పెట్టడంతోపాటు ఇంటి పన్నుల పెంపుకు వ్యతిరేకంగా శీనయ్య గోడలపై వ్రాయించిన వ్రాతలపై కార్పొరేషన్ సిబ్బంది చేత తెల్ల సున్నమేయించారు. వివేకా విచిత్ర పోకడలపై ట్రంకురోడ్డులో వాడివేడి చర్చ జరుగుతోంది.

ఎట్టకేలకు 'వైఎస్' పేరు!



కొన్ని పనులు ఇష్టం లేక పోయినా చేయక తప్పని పరిస్థితి ఎదురౌతుంది. ఒకప్పుడు వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి వీర విధేయులుగా వుండిన ఆనం బ్రదర్స్ ఆ తర్వాత మారిపోయారు. వైఎస్ బ్రతికి వుండగా నెల్లూరు కార్పొరేషన్ భవన నిర్మాణానికి నిధులిచ్చారు. దీని వల్లే కార్పొరేట్ స్టైల్‌లో కార్పొరేషన్ భవన నిర్మాణం చేశారు. ఈ భవనానికి 'వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కార్పొరేషన్ భవనం'గా పేరు పెట్టాలని గతంలో జరిగిన కార్పొరేషన్ సమావేశంలో తీర్మానించారు. ఏడాదిగా బ్రదర్స్ ఒత్తిడి వల్ల ఈ పేరు పెట్టను అధికారులు సంశయిస్తూ వచ్చారు. కార్పొరేషన్ కార్యాలయం పొదలకూరురోడ్డులో ఓ మూలన కనపడకుండా వుండడంతో మెయిన్ రోడ్డులో బోర్డు పెట్టక తప్పని పరిస్థితి. కొత్త బోర్డుతో కార్యాలయ ముఖ ద్వారం కళకళలాడుతున్నా 'వారి' ముఖాలు మాత్రం కళావిహీనంగా వున్నాయి.

వింత పేర్లు!



బంగాళాఖాతంలో ఏర్పడుతున్న తుపాన్‌లకు దక్షిణాసియాలో దేశాలన్నీ కలిసి ఓ పేరు పెడుతున్నాయి. ఒక్కో సారి ఒక్కోదేశం నుంచి ప్రాతినిధ్యం వహించే పేర్లు పెడుతుండడంతో వింతా – విడ్డూరం జనాలకు తప్పడం లేదు. లైలా, జల్ తాజాగా థానే పేర్లు పెట్టుకొన్న తుఫాన్లు తీవ్రత రూపంలో భయపెట్టకపోయినా పేరు రూపంలో మాత్రం గందరగోళం పెట్టడంపై ట్రంకురోడ్డులో విస్తృత చర్చ జరుగుతోంది.

మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

సమాజ కార్యక్రమాలలో పాల్గొంటారు. గౌరవమర్యాదలు చక్కగా లభిస్తాయి. సోదరుల తోడ్పాటు చక్కగా వుంటుంది. వృత్తి వ్యాపారాలలో పురోభివృద్ధి చక్కగా వుంటుంది. చిన్న చిన్న విరోధాలు మన శ్శాంతిని చెడగొడతాయి. వృథా వాదాలకు దిగవద్దు. శుభకార్యాలకై ఖర్చులు చేస్తారు. ఇరుగుపొరుగువారిని అనుసరించి పోవడం మంచిది. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని పరిస్థితి ఏర్పడవచ్చు.

వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

ఇల్లుమార్పిడి, స్థలమార్పిడుల గురించి చింతిస్తారు. ఇంటికి సంబంధించి దుబారా ఖర్చు చేస్తారు. దూరప్రయాణావకాశాలు కానవస్తున్నాయి. మనశ్శాంతికై దేవాలయాలకు వెళతారు. వివిధమార్గాల ధనప్రాప్తి. అనుకూల వాతావరణం. పురోభివృద్ధికి సహాయ సహకారాలందించే వారితో మైత్రి ఏర్పడుతుంది. మిత్రులతో కలసి వినోదయాత్రలు చేసే అవకాశాలున్నాయి.

మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

విందు వినోదాలలో ముఖ్యపాత్ర వహిస్తారు. చాలకాలంగా ప్రయత్నిస్తూ వచ్చిన పనులు ఈనాడు ఫలోన్ముఖమవుతాయి. పురప్రముఖుల పరిచయం ఆనందాన్నిస్తుంది. జాయింటు వ్యవహారాలు చక్కదిద్దుకొంటాయి. ఆకస్మిక సంఘటనలకు అవకాశాలున్నాయి. వినోదాలలో కాలక్షేపం చేస్తారు. సంతాన మూలకంగా ఖర్చులు. నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. అప్పులు తీరుస్తారు.

కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

మిత్రులతో సమాగమం తద్వారా అనుకొన్నవి సాధిస్తారు. ధనాదాయం తృప్తికరంగా వుంటుంది. వృత్తి ఉద్యోగాల్లో కోరుకొన్న మార్పు చేర్పులు జరిగే సూచనలు. బంధువుల మూలంగా చిరు ఖర్చులు. ఆరోగ్యం చక్కగా వుంటుంది. ప్రభుత్వం ద్వారా ఆదాయాలు. బంధు మిత్రుల సమాగమం సుఖసంతోషాల నిస్తుంది. శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుంది. వ్యాపారవృద్ధికై అప్పులు చేస్తారు.

సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

కళత్రంతో గొడవలుండవచ్చు. కళత్ర బంధువులు దానినికి కారణమవవచ్చు. ధన విషయాలలో లోటు లేదు. రుణరూపంలో కూడా ధనప్రాప్తి. భాగస్వాములు మోసగించే అవకాశాలున్నాయి. వ్యాపారులకు పోటీలధికం. పాదాలకు గాయాలు తగిలే అవకాశం. ఉద్యోగులకు ప్రమోషన్ లేదా ఆదాయవృద్ధి వుండవచ్చు. రాజకీయులకు ఉత్తమకాలం. వృత్తిపరులు లాభపడతారు. విద్యార్థులకు శ్రమ.

కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

ఆర్థిక లావాదేవీలు మీకు అనుకూలంగా వున్నా స్పెక్యులేషన్ జోలికి పోవద్దు. తప్పనిసరిగా కొన్ని గృహోపకరణాలు కొనవలసి వస్తుంది. భాగస్వాములు మోసగించే అవకాశాలున్నాయి. ఉద్యోగులకు ప్రోత్సాహకాలు తక్కువ. భూభవనాల వస్తు వాహనాల ద్వారా ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి. వారసత్వాలు లాభిస్తాయి. రాజకీయులకు ప్రోత్సాహం తక్కువ.

వారఫలాలు

తేది 07-01-2012 నుండి 13-01-2012 వరకు ధనుస్సులో రవి, బుధులు; మకర, కుంభాల్లో శుక్రుడు; మేషంలో గురువు; సింహంలో కుజుడు; తులలో శని; వృశ్చికంలో రాహువు; వృషభంలో కేతువు; వృషభ, మిథున, కర్కాటక, సింహాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

శుభ ముహూర్తాలు లేవు.

జనవరి తిథులు

మార్గశిర బహుళ

7	శని	త్రయోదశి	ప	11.10	గం.ల.వ
8	ఆది	చతుర్దశి	ప	12.20	గం.ల.వ
9	సోమ	పౌర్ణమి	ప	01.02	గం.ల.వ
10	మంగళ	పాడ్యమి	ప	01.07	గం.ల.వ
11	బుధ	విదియ	ప	12.35	గం.ల.వ
12	గురు	తదియ	ప	11.34	గం.ల.వ
13	శుక్ర	చవితి	ప	10.16	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com

తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

కంటికి, ఊపిరితిత్తులకు సంబంధించి ఇబ్బందులుండవచ్చు. కళత్ర సంబంధం చక్కగా వుంటుంది. పెద్దల సాయంతో ఉద్యోగవృద్ధి, వేతనవృద్ధి వుంటుంది. చిరకాలంగా ఎదురుచూస్తూ వచ్చిన శుభ ఫలితాలు అనుభూతిలోకి వస్తాయి. శత్రువులు లొంగి నడచు కొంటారు. బంధువులకు మీ చేతనైన సహాయం చేస్తారు. వ్యాపారులు కొత్తసంబంధాలు ఏర్పరచుకొంటారు.

వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

ఆరోగ్య విషయంలో ఒత్తిడి వల్ల ఇబ్బందులు. కళత్ర సుఖం చక్కగా వుంటుంది. సంతానమూలంగా సుఖ శాంతులు లోపిస్తాయి. ధన విషయంలో లోటుండదు. స్పెక్యులేషన్ కూడా లాభిస్తుంది. భవిష్యత్తుకు మంచి పథకాలు వేస్తారు. రాజకీయులకు అత్యంతం అనుకూలమైన కాలం. వ్యాపార విస్తరణ చేస్తారు. విద్యార్థులకు మంచి కాలం. వృత్తిపరులకు కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి.

ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

ప్రియ వార్తాశ్రవణం. కుటుంబంలో మీ పలుకుబడి పెరుగుతుంది. నూతన వస్త్రాదులు ధరించి ఎంతో సంతోషంగా కానవస్తారు. ప్రముఖుల సహాయ సహకారాలు అందుతాయి. ధనసంపదలు, ఆస్తి పెంపుదల సూచన. జీవశక్తి చక్కగా వుంటుంది. నిరీక్షణ చేస్తూ వుండిన వ్యక్తుల్ని కలుసుకొంటారు. దైవారాధన, పుణ్యక్షేత్రాటన వైపు మనసు పోనిస్తారు. చేతిలో చిల్లి గవ్వ నిలవదు.

మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

సమాజంలో కొత్త వారితో పరిచయాలు ఏర్పడుతాయి. ఇష్టులైన వారితో సమాగమముంటుంది. కళత్ర సంబంధీకులతో ఉదార హృదయంతో నడచుకోవాలి. మిత్రులు సాయమందించడానికి ముందుకు వస్తారు. కుటుంబ సభ్యులతో గొడవలకు అవకాశాలున్నాయి. వృథా ప్రయత్నాలు. వ్యాపారులకు అమ్మకాలు తగ్గు ముఖం పడతాయి. ఉద్యోగులకు అతికష్టంగా సాగుతుంది.

కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. తోటివారు సాయమందిస్తారు. నూతన మిత్రులేర్పడతారు. విదేశీ ప్రయాణావకాశాలు కానవస్తున్నాయి. గృహనిర్మాణ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. వ్యాపార వృద్ధి చక్కగా సాగుతుంది. కొత్త భాగస్వామి లేదా మంచి అనుచరులు లభిస్తారు. రాజకీయులకు మేలైన కాలం. విద్యార్థులకు యోగకాలం. ఉద్యోగినులకు చాలా ప్రయోజనవంతమైన కాలం.

మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

సంతానమూలంగా మానసిక వేదనకు గురౌతారు. దైవానుగ్రహానికి ప్రయత్నం చేయండి. ధన విషయంలో తండ్రి సోదరులతో ఇబ్బందులు రావచ్చు. గుట్టుగా కాలం గడపడం మంచిది. ఆర్థిక విషయాలు అంతంతమాత్రమే. ఇరుగుపొరుగువారి సహాయం అందవచ్చు. వ్యాపారులు ఖాతాదారులతో జాగ్రత్తగా మెలగాలి. రాజకీయులకు తీరని వేదన చోటుచేసుకొంటుంది.

బంగారు భవిష్యత్తును నాశనం చేసుకొంటున్న కేలెండర్ మనుషులు!

ఎన్.శరత్‌కుమార్‌రెడ్డి కోవూరు

** మా నాన్నగారు అన్ని పనులకూ కేలండర్ చూస్తారు. ఎక్కడి పనులక్కడే ఉన్నాయి.*

దాదాపు యాభై శాతంపైగా 'కేలండర్' చూసి పనులు చేస్తున్నారు. అయితే విచిత్రం ఏమిటంటే 'కేలండర్' ఎలా చూడాలో, అష్టమి, నవమి ఎంత కాలం వరకూ ఉంటాయో మాత్రం వాళ్లకు తెలీదు. బంగారు భవిష్యత్తు ఇలా పాడైపోతూ ఉంది.

ఎన్.శాంతాసుందరి ఆత్మకూరు

** అతనిది రోహిణి నక్షత్రం, ఆమెది కృత్తికా నక్షత్రం. వివాహం కుదరదన్నారు.*

రోహిణికి శత్రు నక్షత్రం స్వాతి, కృత్తికకు విశాఖ నక్షత్రం.

షేక్ ఇస్మాయిల్ కడప

** నాది ఉత్తర ఒకటవ పాదం, ఆవిడది విశాఖ నాలుగవ పాదం. ఎప్పుడూ ఒకరికొకరికి పడదు.*

ఉత్తర సింహరాశి, విశాఖ వృశ్చిక రాశి. ఉత్తరకు వ్యతిరేకం మీనరాశి. వృశ్చికానికి మిథున రాశి. అందువల్ల రాశుల వల్లగాక స్వభావాల వల్ల మీ మధ్య గొడవలొస్తున్నాయి.

సి.షర్మిళనాయుడు హైదరాబాద్

** అశ్వని నక్షత్ర జాతకులు, చిత్తా నక్షత్రం వారిని వివాహం చేసుకోకూడదా?*

అని ఎవరన్నారు. అశ్వని గుర్రం, చిత్త పులి శత్రువర్గం కాదు. అశ్వనికి స్వాతి, హస్తలు శత్రు నక్షత్రాలు, చిత్త కాదు. అందువల్ల వివాహం చేసుకోవచ్చు.

అవనిగడ్డ పరమేశ్వరి గుంటూరు

** వివాహాల్లో అరటి చెట్లను అలంకార ప్రాయంగా వాడవచ్చునా?*

అరటి చెట్లను స్వాగత ద్వారాల వద్ద వాడవచ్చు. అయితే అవి పువ్వు, కాయ, గెలలువేసి ఉండరాదు. 'భ్రూణదోషం'(శిశుహత్య దోషం) కలుగుతుందని 'విశ్వామిత్ర' వాస్తు చెబుతోంది.

ఇ.వైష్ణవి పెనుకొండ

** ఆయన పర స్త్రీ వ్యామోహంలో పడ్డారు. నాకేదైనా సలహా ఇవ్వండి?*

విషయాన్ని పెద్దవాళ్లకి తెలియజేయండి. 'సుదర్శ యంత్రాన్ని' దేవుడి గదిలో ప్రతిష్టించండి. రుద్రాక్ష మండల పూజా విధానం కూడా మంచి ఫలితాలనిస్తుంది.

ఎన్.శారదానాయుడు నెల్లూరు

** 'వృక్షవేధ' అంటే ఏమిటి? నివృత్తి ఏమిటి?*

గృహస్తు స్థలాలలోని చెట్లను నరికివేయడం వల్ల వృక్షవేధ(ఘోష) దంపతులకు ప్రాప్తిస్తుంది. ఫలితంగా ఆరోగ్య, ఆర్థిక, మానసిక సమస్యలు తలెత్తుతాయి. ఈ స్థితిలో పరిష్కారానికై వాస్తు శాస్త్ర వేత్తను సంప్రదించాలి.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

సయ్యద్ మహ్మద్‌షఫి హైదరాబాద్

** తూర్పు ఆగ్నేయం వీధి తగులుతున్నది. ఇల్లు కట్టేశాము. ఇప్పుడేం చేయాలి.*

తూర్పు ఆగ్నేయంలో గది నిర్మాణం చేసి దక్షిణ ఆగ్నేయం ద్వారం ఏర్పాటుచేయండి. తూర్పు ఆగ్నేయం నీచం అయినా దక్షిణ ఆగ్నేయం ఉచ్ఛ స్థానమై వీధిపోటును నిర్వీర్యం చేస్తుంది.

యనమల గిరిజారెడ్డి కావలి

** అశ్వత్థ, జమ్మి వృక్షాల పూజ చేయవచ్చునా?*

వృక్షాలు త్రిమూర్తి స్వరూపాలని 'మంత్ర రాజ మార్తాండ' గ్రంథం విస్పష్టంగా చెబుతోంది. వృక్ష మూలం బ్రహ్మ, మధ్య విష్ణువు, పైభాగంలో శివుడు నివశిస్తుంటారట!

డి.సుకన్య ఆదోని

** వివాహానికి రాశులొకటే అయినా వివాహం చేయవచ్చా?*

రాశులొకటే అయినా సప్తమ, చతుర్థ భావాలున్నా చేయకూడని నక్షత్రాల్లో లగ్న, గ్రహబలాలు బాగుంటే సలక్షణంగా వివాహం చేయవచ్చు.

ఎస్.ఇందుమతిరెడ్డి తిరుపతి

** ఈశాన్యంలో మామిడి చెట్టును తీసేశాము. శ్రీవారు మంచానపడ్డారు.*

తూర్పు సగభాగం ఈశాన్యమని ఎవరు చెప్పారు. దిక్కులో ఏడు, ఎనిమిది భాగాలు మాత్రమే ఈశాన్యం. కాయలున్న వృక్షాన్ని తీసివేయడం 'గర్భవతి' హంతక దోషం. మీరు 101 చెట్లను నాటించండి. దోషం పోతుంది.

నామ్‌కే వాస్తేగా రెవెన్యూ సదస్సులు!

డిసెంబర్ మాసంలో భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన రెవెన్యూ సదస్సులు తూతూ మంత్రంగా ముగిసాయి. ఈ సదస్సుల మూలంగా రైతులకు, ప్రజలకు చేకూరిన ప్రయోజనం శూన్యం.

భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన రెవెన్యూ సదస్సులు డిసెంబర్ నెలాఖరుతో ముగిశాయి. దాదాపు నెలరోజులపాటు అన్ని మండలాల్లో ఈ కార్యక్రమం తూతూ మంత్రంగా నిర్వహించబడింది. రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులతో రైతులు, ప్రజలకు పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. రెవెన్యూ గ్రామపరిధిలో నిర్వహించిన సదస్సులకు తహశీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, విఆర్వోలు హాజరయినప్పటికీ ప్రజలు, రైతుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేకపోయాయి. ఒక్కో మండలంలో ప్రణాళికాబద్ధంగా సదస్సు ఏర్పాటు చేయాల్సి వున్నప్పటికి ఆ విధంగా ఎక్కడా నిర్వహించకపోగా మండలస్థాయి అధికారులు తమ ఇష్టానుసారంగా వీటిని నిర్వహించి చేతులు దులుపుకున్నారు.

డిసెంబర్ 1తేది నుంచి నెలాఖరు వరకు ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గ్రామాల్లో రెవిన్యూ సదస్సుల్లో వుండాల్సిన అధికార యంత్రాంగం మధ్యాహ్నానికల్లా కార్యక్రమాన్ని ముగించుకొని మండల కేంద్రానికి చేరుకున్నారు. ముందస్తు సమాచారం లేకుండానే గ్రామాల్లో సదస్సు ఏర్పాటు చేయడంతో ప్రజలు హాజరై తమ సమస్యలు విన్నవించుకోలేకపోయారు. జిల్లాలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నందున ఉదయం ఏడు గంటలకే కూలి పనులకు వెళ్లిపోయారు. అందుబాటులో వున్న వారు మాత్రమే వీటికి హాజరయ్యారు. మరోప్రక్క గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న వారు తమకు పట్టాలు మంజూరు చేయాలని ఏళ్ల తరబడి జిల్లా కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే వున్నప్పటికీ సమస్యల పరిష్కారం మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వుంది. అంతేకాకుండా మరికొన్ని గ్రామాల్లో స్మశానానికి సరైన దారిలేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలోనే పేద ప్రజలకు స్మశానానికి వెళ్లేందుకు దారి చూపించలేక పోతున్నారన్న ఆరోపణలు వున్నాయి. విడవలూరు మండలం అలగానిపాడు గ్రామంలో దళితులు స్మశానానికి వెళ్లాలంటే రైతులకు చెందిన పొలాల్లో నుంచి వెళ్లాల్సి వుంటుంది. దీంతో రైతులు దళితులకు తరచూ వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. పై సంఘటన కేవలం ఉదాహరణ మాత్రమే. ఇటువంటి సంఘటనలు అన్ని ప్రాంతాల్లో వున్నాయి. రెవెన్యూ సదస్సుల సందర్భంగా పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగళ్, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలు ఎక్కడా అమలు జరిగిన సందర్భం కానరాలేదు. సదస్సులో వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతి ప్రతాలు స్వీకరించిన అధికారులు కార్యాలయానికి రమ్మని చెప్పి వారికి అవసరమైన పత్రాలను జారీ చేసేందుకు శ్రీకారం చుట్టారు.

జిల్లావ్యాప్తంగా నెలరోజుల పాటు జరిగిన రెవెన్యూ సదస్సుల పుణ్యమా అంటూ అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో లేకుండా పోయారు. తహశీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాసేవ కేంద్రాల్లో అవసరమైన ధృవీకరణ పత్రాల కోసం నగదు చెల్లించి దరఖాస్తు చేసి రోజులు గడుస్తున్నా అధికారుల్లో స్పందన కానరావడం లేదు. గ్రామాల్లో ఒక్క రోజు నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో ధృవీకరణపత్రాలు జారీ చేయడం ఎలా వీలవుతుందని రెవెన్యూ సిబ్బందే తిరిగి ప్రశ్నిస్తున్నారు. ఒకపక్క రెవెన్యూ సదస్సులు జరుగుతుంటే మరో ప్రక్క భూ సమస్యపై ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు అందుతూనే వున్నాయి.

రెండు నెలల ముందు పట్టాదారు పాసుపుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు రెవెన్యూ సదస్సుల్లో వాటిని అందజేశారు. అడంగళ్, గ్రామపటం, పాసుపుస్తకాల కోసం నేటికి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ అనేక మంది రైతులు తిరుగుతూనే వున్నారు.

భరోసా ఏది?

● ప్రైవేటు ఆస్పత్రులలో

భద్రతపై భరోసా లేదు!

జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులలో ఊహించని పరిస్థితుల్లో అగ్ని ప్రమాదం జరిగితే లోపలున్న రోగులు సురక్షితంగా బయటపడే అవకాశం వుందా అనే కోణంలో వైద్య ఆరోగ్య శాఖాధికారులు తనిఖీలు చేపడుతున్నారు.

జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులలో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలపై వైద్య ఆరోగ్య శాఖ తనిఖీలు చేపట్టింది. ఇటీవల కలకత్తా నగరంలో ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం సంభవించి 100 మందికిపైగా మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ఆస్పత్రులలో భద్రతా ప్రమాణాలపై దృష్టి సారించాలని ఆదేశించింది. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఆస్పత్రులను తనిఖీలు చేసే పనిలోపడ్డారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆస్పత్రిని ఏర్పాటు చేసే ముందు కాలుష్యంతోపాటు భద్రతపై తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి వుంటుంది. కొన్ని ఆస్పత్రులు ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ కూడా చేయించుకోని పరిస్థితి వుంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ ఉత్తర్వులు వెలువడిన అనంతరం కొన్ని ఆస్పత్రుల నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చేయించుకోగా మరికొన్ని ఆస్పత్రుల వారు ఏమాత్రం పట్టించుకోలేదు.

అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇప్పటివరకు ఏ ఒక్కరూ కూడా దృష్టి సారించలేదు. ప్రమాదాలు జరగవన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగితే పరిణామాలు ఎలా వుంటాయో ఊహించడం కష్టతరమన్న విషయాన్ని మరచిపోతున్నారు. ఇప్పటికి రెండు, మూడు ప్రాంతాల్లో చేసిన తనిఖీల్లో భద్రతా ప్రమాణాలు సరిగ్గా పాటించడం లేదన్న విషయాన్ని గుర్తించారు. వీరి తనిఖీలను ముందుగా పసిగట్టిన ఇతర ఆస్పత్రుల నిర్వాహకులు భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమైనట్లు తెలుస్తుంది.

వైద్య ఆరోగ్యశాఖ అధికారుల తనిఖీలకు ముందుగా కాలుష్య నియంత్రణ మండలి విభాగం అధికారులు కూడా నగరంలో వున్న పలు కార్పొరేట్ ఆస్పత్రులను తనిఖీలు చేశారు. ఆస్పత్రుల నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలను ఎక్కడ నిల్వ చేస్తున్నారన్న దానిపై నిర్వాహకుల నుంచి వివరాలు సేకరించారు. వీరి తనిఖీల అనంతరం భద్రతా ప్రమాణాల విషయం తెరపైకి వచ్చింది. రాష్ట్రప్రభుత్వం భద్రత పాటించని వైద్యశాలల గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరిక జారీ చేసింది. ఇంత వరకు బాగానే వున్నా ఆసుపత్రుల ప్రారంభ దశ నుంచే ఇటువంటి చర్యలు చేపట్టి వుంటే బాగుండేదన్న అభిప్రాయం వైద్యులే వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడో ఒక సంఘటన జరిగిన సమయంలో ఇక్కడ అధికారులు అప్రమత్తం కావడం మంచి పరిణామంగా భావిస్తున్నప్పటికి నిత్యం తనిఖీలు, పర్యవేక్షణ చేయకపోవడంపై అధికారులపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ చేయించడం తోపాటు భద్రతపై వైద్య ఆరోగ్యశాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సైతం అన్ని ఆసుపత్రులను క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తే పరిస్థితులు మెరుగుపడతాయి.

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Online‌లో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజ బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 106811011000423లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-
విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190



మంచి పాత్రలే నిలబెడతాయి!

ఓం శాంతి ఓం చిత్రం దీపికా పదుకొణెను బాలీవుడ్‌లో మంచి హీరోయిన్‌గా నిలబెట్టింది. ఈ ఏడాది ఆమె నటించిన ఆరక్షణ్, దేశీబాయ్స్ చిత్రాలు బాగా ఆడాయి. సినిమాకో కొత్త హీరోయిన్ పరిచయమవుతున్న ప్రస్తుత తరుణంలో బాలీవుడ్‌లో హీరోయిన్ల మధ్య ఎలాంటి వాతావరణముంది, తాను ఆ పరిస్థితులను ఎలా ఎదుర్కొంటున్నది ఇటీవల హైదరాబాద్ వచ్చిన దీపికా చెప్పుకొచ్చింది. సినిమా పరిశ్రమ పుష్పక విమానం లాంటిది. ఎంత మంది వచ్చినా ఇక్కడ ఇంకొకరికి చోటుంటుంది. మనలో ప్రతిభ వుండాలే కానీ ఎంతమంది వచ్చినా మన ప్రత్యేకత మనదే. కేవలం గ్లామర్‌ని మాత్రమే నమ్ముకొంటే కొన్ని చిత్రాలతో మనపని అయిపోయినట్టే. మంచి పాత్రలను ఎంచుకుంటే నటిగా ఎక్కువ కాలం నిలదొక్కుకోవచ్చంటుంది.

ఆరేసే పాత్రలు!



మొగుడులో కనిపించింది కాసేపే అయినా... అందాలు ఆరబోయడానికి ఏమాత్రం వెనుకంజ వేయలేదు హీరోయిన్ శ్రద్ధాదాస్. దీంతో ఆమెకు ఇటువంటి పాత్రలే వెతుక్కొంటూ మరీ వస్తున్నాయి. వైవిఎస్ చౌదరి దర్శకత్వంలో తయారవుతున్న రేయ్ చిత్రంలో ఆమెకు అందాలు ఆరేసే పాత్ర దక్కింది. బ్యాంకాక్‌లో ఈ చిత్రం షూటింగ్ జరుగుతుండగా ఆమె కంటికి గాయమైంది. కుడి కన్ను తెరవలేని పరిస్థితులలోనూ తనవల్ల షూటింగ్ ఆగకూడదని ఆమె నటించి యూనిట్ ప్రశంసలు పొందింది. దొరికిన పాత్రల్లో నటించనంటే పాత్రలే లేకుండా పోతాయోమోనన్న బాధను శ్రద్ధా వ్యక్తం చేసింది.

బాలకృష్ణ సరసన జయసుధ



ఇప్పటివరకు బాలకృష్ణ – జయసుధ జోడి కట్టిన చిత్రమే లేదు. ఒకట్రెండుసార్లు వీరు నటించే అవకాశం వచ్చినట్లే వచ్చి చేజారిపోయింది. అధినాయకుడు చిత్రంలో బాలకృష్ణ మూడు పాత్రల్లో కనిపించనున్నారు. జయసుధ కూడా ఓ బాలకృష్ణకు భార్యగా మరో బాలకృష్ణకు అమ్మలా, ఇంకో బాలకృష్ణకు నాయనమ్మలా మూడు పాత్రల్లో కనిపించనుంది. చూడాలి ఈ జంటకు లభించే జనామోదం?

దక్షిణాదికి సోనమ్!



హీరో అనిల్‌కపూర్ కుమార్తె సోనమ్ కపూర్ హిందీలో హీరోయిన్‌గా నటిస్తుంది. త్వరలోనే ఆమె దక్షిణాదికి వస్తున్నట్లు సమాచారం. గతంలో సోనమ్ తెలుగు, తమిళ చిత్రాల్లో ఆఫర్లు వచ్చినా తిరస్కరించింది. మణిరత్నం తమిళంలో పాతహీరో కార్తీక్ కుమారుడు హీరోగా 'పుక్కడై' సినిమాను తీస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రాధ చిన్న కుమార్తె తులసి, కమల్‌హాసన్ చిన్న కుమార్తె అక్షర పేర్లు ప్రముఖంగా వినిపించాయి. మణిరత్నం అంతిమంగా సోనమ్‌ను హీరోయిన్‌గా తీసుకొన్నారట. పుక్కడై చిత్రాన్ని తెలుగులోకి అనువాదం చేస్తారు.

మహేష్‌బాబు ముద్దిస్తాడా?



హీరో మహేష్‌బాబు బిజినెస్‌మెన్‌గా సంక్రాంతికి సందడి చేయబోతున్నాడు. ముంబై నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ చిత్రంలో కాజల్ హీరోయిన్. స్వతహాగా సిగ్గరి అయిన మహేష్ ఈ చిత్రంలో కాజల్‌తో ముద్దు సన్నివేశంలో నటించాడని ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతుంది. అయితే చిత్ర వర్గాలు ఈ విషయం గూర్చి పెదవి విప్పడం లేదు. దర్శకుడు పూరి జగన్నాధ్ మాత్రం ఈ చిత్రానికి మహేష్‌బాబు పాత్ర, ఆయన నటన ప్రాణం. ఆయన్ని గతంలో చూడని తరహాలో ప్రేక్షకులు తెరపై చూడబోతున్నారని చెబుతున్నాడు. చూడాలి ఇదేం తరహానో?



చిత్ర సమీక్ష

✍ అల్లూరు రహీం

హీరో జగపతిబాబు, హీరోయిన్ ప్రియమణిలు హిట్ చిత్రం కోసం చాలా రోజులుగా పరితపిస్తున్నారు. శ్రీ బాలాజీ మూవీస్ పతాకంపై జి.గోవిందరాజు నిర్మాతగా వ్యవహరించి తీసిన 'క్షేత్రం' చిత్రంపై వాళ్లు ఎన్నో ఆశలు పెట్టుకొన్నారు. హీరో జగపతిబాబైతే అరుంధతిలా ఈ చిత్రం విజయం సాధిస్తుందని ఇంటర్వ్యూలలో సైతం ప్రకటించారు. కానీ వాస్తవానికి క్షేత్రం'లో అంత సరుకు లేదు. ఈ చిత్రానికి కొత్త దర్శకుడు టి.వేణుగోపాల్ కథ, స్క్రీన్‌ప్లేతోపాటు దర్శకత్వ బాధ్యతలు నెరిపాడు. భక్తిభావాలున్న కథకు ఆయన అద్దిన వ్యాపార సూత్రాల మేళవింపు కుదరలేదు. సాగతీత చిత్రాన్ని బలహీనపర్చింది. పాత తరహా పద్ధతుల్లో అరటిపండు వలచి పెట్టినట్లు ఆయన చెప్పిన కథ ఈ తరం ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. బడ్జెట్ పరిమితమేమో గ్రాఫిక్స్ సన్నివేశాలు చాలా చీప్‌గా చిత్రీకరించిన తీరు తెరపై కనపడిపోతోంది. ఎంతో అనుభవమున్న కెమెరామెన్ ఎం.వి.రఘు కెమెరా పనితనం ఈ చిత్రంలో పెద్దగా కనపడలేదు. పరుచూరి బ్రదర్స్ మాటల్లో ఒకటంటే ఒక్కమాట చెప్పుకోతగింది లేదు. సంగీత దర్శకుడు కోటి మనసుపెట్టి ఈ చిత్రానికి సంగీతం కూర్చలేదు. పాత బాణీల్లోనే చుక్కా చుక్కా నరసింహరాయ చరణాలతో సాగే పాటలను లాగించేశాడు. రిచ్‌నెస్ కోసమంటూ మలేషియాలో చిత్రీకరించిన సన్నివేశాల్లో ప్రత్యేకత లేదు. ఈ చిత్రంలో ఐదారు డజన్ల మంది నటీనటులు, వందలాది మంది జూనియర్ ఆర్టిస్టులు నటించారు. కానీ వీళ్లలో దర్శకుడు తెరపై పది మందిని కూడ సరిగ్గా ఉపయోగించుకోలేక పోయాడు. లక్ష్మీనరసింహస్వామి పేరువింటే ఆత్మలు, ప్రేతాత్మలు పదిమైళ్ల దూరం పరుగెడుతాయని నానుడి. కానీ ఈ చిత్రంలో ఓ ఆత్మ విగ్రహ ప్రతిష్టాపన చేయడం కాస్త గందరగోళంగా తోస్తుంది. తెరపై ఏదో చెప్పాలని ఏదేదో చెప్పేయడంతో క్షేత్రం బలహీనపడిపోయిందనవచ్చు.

చిత్ర కథలోనికి వెళ్తే మలేషియాలో ఓ టీవి ఛానల్‌లో ప్రోగ్రామ్స్ చేసే చక్రి(కిక్ శ్యామ్), సోహినీ (ప్రియమణి) మధ్య ప్రేమ పుడుతుంది. చక్రిది ఆంధ్రప్రదేశ్‌లోని కుగ్రామం దేవునికొండ. సోహినీది ముంబాయి. వీరిద్దరూ తమ ప్రేమ వ్యవహారాన్ని పెద్దలకు చెప్పి వెబ్ కెమెరాల్లో నిశ్చితార్థం నెరపి, పెళ్లి చేసుకోను ఇండియా వచ్చేస్తారు. విశ్వనాధరాయుడు (ఆదిత్య మీనన్) తన కుమారుని పెళ్లి ఘనంగా జరిపి వారికి వంశపారంపర్య చక్రధరరాయ ట్రస్ట్ ఆస్తిపాస్తులివ్వను పోగా కోడలు సోహినీ తనలో ఆత్మ ప్రవేశించడంతో ఊగిపోతుంది. మామ విశ్వనాధరాయుడ్ని బల్లెంతో పొడిచి చంపుతుంది. అక్కడ నుంచి కథ ఫ్లాష్‌బ్యాక్‌లోనికి వెళ్తుంది. శ్రీకృష్ణదేవరాయల వంశీయుల్లో ఐదవ తరానికి చెందిన వీరనరసింహరాయుడు(జగపతిబాబు) దేవునికొండపై వెలసిన పెంచల లక్ష్మీనరసింహస్వామిని గ్రామంలో ప్రతిష్ట చేయాలనుకొంటాడు. స్వామిని గ్రామంలో ప్రతిష్టిస్తే అనాధిగా ఉన్న వేల కోట్ల రూపాయల స్వామి సంపదను 45 గ్రామాల వారికి సమానంగా పంచాలి. దీనికి నరసింహరాయుడి చిన్నాన్న(కోట శ్రీనివాసరావు) వ్యతిరేకి. తన కుమారుడు విశ్వనాధరాయుడితో తెలివిగా ఒక పథకం రచించి వీరనరసింహరాయుడిని అంతమొందిస్తారు. రాయుడు భార్య లక్ష్మి(ప్రియమణి) ఆ ప్రయత్నం చేయబోగా ఆమెనూ చంపేస్తారు. దీంతో కోరిక తీరని లక్ష్మి ఆత్మ అచ్చం తనలా ఉండే సోహినీని ఆవహిస్తుంది. పలు నాటకీయ పరిణామాల అనంతరం అంతిమంగా తమ వంశస్తుడు చక్రిచేత లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ట చేయించి, సంతోషంగా సోహినీ దేహాన్ని విడచి వెళ్లడంతో చిత్రం ముగుస్తుంది.

ఈ చిత్రంలో మెయిన్ క్యారక్టర్ ప్రియమణిది. కానీ ఈ పాత్ర పోషణ ఆమె చేత కాలేదు. వీర నరసింహరాయుడుగా జగపతిబాబు పరిమిత స్థాయిలోనే నటించాడు. ఆదిత్యమీనన్ నటన ఓవర్‌గా తోస్తుంది. కిక్ శ్యామ్ పాత్రోచితంగానే సాగాడు. స్వామిగా తనికెళ్ల భరణి పాత్రలో కొత్తదనం లేదు. మూడు గంటలు ఎంత పెద్ద బండలనైనా భరిస్తామన్న ధైర్యమున్న ప్రేక్షకులు క్షేత్రం చూడను వెళ్లొచ్చు.



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి. ప్రక్కన శ్రీధర్‌కృష్ణారెడ్డి, డాక్టర్ కిరణ్, డాక్టర్ కవితారెడ్డి.

ఆధునీకరించిన స్మైల్ హాస్పిటల్!

నెల్లూరు దినదినాభివృద్ధి చెందుతుందని, అదే విధంగా నగరంలోని హాస్పిటళ్లు కూడా నూతన వైద్య విధానాలతో అభివృద్ధి చెందుతున్నాయని రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి అన్నారు. రమేష్ రెడ్డి నగర్‌లో ఆధునీకరించిన స్మైల్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాలను డిసెంబర్ 29వ తేది ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 12 ఏళ్ల క్రితం నేనే ఈ హాస్పిటల్‌ను ప్రారంభించాను. ఇప్పుడు పెద్ద పెద్ద నగరాలకు ధీటుగా హాస్పిటల్‌ను తీర్చిదిద్ది తిరిగి నా చేతుల మీదుగా ప్రారంభింపజేస్తున్నందుకు ఆనందంగా వుందన్నారు. అధునాతన పరికరాలతో ఆధునిక వైద్యాన్ని నెల్లూరీయులకు అందుబాటులో తెచ్చిన డాక్టర్ కిరణ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా దంత వైద్యశాల మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ జి.కిరణ్ మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో ఎటువంటి కోత, నొప్పి లేకుండా అన్ని దంత సమస్యలను పరిష్కరించే లేజర్ చికిత్సా విభాగం, ఆధునాతన ఎక్స్‌రే విభాగం, స్కానింగ్ విభాగం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, మాజీ మేయర్ నందిమండల భానుశ్రీ, డాక్టర్ కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఆడిట్ కార్యాలయంలో

లంచాల పందికొక్కులు!

అవినీతిని అంతమొందించేదెవరు?

నెల్లూరు జిల్లా ఆడిట్ కార్యాలయంలో లంచమిస్తేనేగాని ఫైల్ ముందుకు కదలని పరిస్థితి నెలకొని వుంది. కార్యాలయంలో సీనియర్ ఆడిటర్స్‌గా పని చేస్తున్న సురేంద్రబాబు, రమేష్‌లు గత 13 ఏళ్లుగా ఇక్కడే పాతుకొనిపోయి పని చేస్తున్నారు. రిటైర్ అయిన నాల్గవ తరగతి వుద్యోగులను ఎస్‌ఆర్ తప్పులున్నాయంటూ పెన్షన్ రాదని బ్లాక్ మెయిల్ చేస్తూ దాన్ని సరిదిద్దుతామని పెద్ద మొత్తాలు



నెల్లూరులోని ఆడిట్ ఆఫీస్.

డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సురేంద్రబాబు తన ఇంటినే వసూళ్ల కేంద్రంగా మార్చారట. మునిసిపాలిటీ, పంచాయితీలు, మండలాలకు ఆడిట్‌కు పోయినప్పుడు ఈ ఇద్దరు అధికారులు ఇదే రీతిన వ్యవహరిస్తున్నారట. ఈ వ్యవహారాన్ని జిల్లా ఆడిట్ అధికారి గుప్తా, జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి దృష్టికి బహుజన్ టీచర్ అసోసియేషన్ తీసుకెళ్లింది. వారేమి చర్యలు తీసుకొంటారో వేచి చూడాల్సిందే.

తూపిలి రాధయ్య స్మారకంగా విరాళం!



జిల్లా కలెక్టర్ సరస్వతినిధికి 25వేల రూపాయల విరాళాన్ని ఆర్‌కెటి రాధయ్య స్మారకంగా అందిస్తున్న ఆయన మనుమడు పవన్.

నెల్లూరు సుబేదారుపేటలోని ఆర్‌కెటి సర్వీసు స్టేషన్ అధినేత దివంగత తూపిలి రాధయ్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన కుమార్తె అనురాధ సరస్వతి నిధికి 25వేల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని రాధయ్య మనుమడు పవన్‌కుమార్ 31తేది జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డిని ఆయన బంగళాలో కలసి అందించారు.

తుఫాన్ ప్రత్యేకాధికారిగా రాజశేఖర్!



తీరప్రాంత ఎమ్మార్వోలకు సూచనలిస్తున్న ప్రత్యేకాధికారి రాజశేఖర్.

జిల్లా తుపాన్ ప్రత్యేకాధికారిగా నియమితులైన ఐఏఎస్ అధికారి బి.రాజశేఖర్ రెండురోజులపాటు జిల్లాలో పర్యటించారు. గతంలో తుపాన్ ప్రత్యేకాధికారిగా వున్న అనంతరాముని వివిధ కారణాల చేత ప్రభుత్వం తప్పించి ఆయన స్థానంలో రాజశేఖర్‌ను నియమించింది. గతవారంలో "థానే" తుపాన్ సంభవిస్తుందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాకు వచ్చిన రాజశేఖర్ తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. గతంలో జిల్లా కలెక్టర్‌గా పని చేసిన అనుభవం వుండడంతో తీరప్రాంత గ్రామాలపై అవగాహన కలిగి వున్నారు. తీరప్రాంత మండలాలకు ప్రత్యేకాధికార్లుగా నియమించిన వారితో ఎప్పటికప్పుడు సంభాషిస్తూ పూర్తి సమాచారాన్ని తెలుసుకున్నారు. అయితే ముందుగా వూహించినంత ప్రమాదాలు చోటు చేసుకోకపోవడంతో అధికారులు వూపిరి పీల్చుకున్నారు.

కులగణన సర్వే గడువు పొడిగింపు!

జిల్లాలో చేపట్టిన సామాజిక, ఆర్థిక కులగణన సర్వే గడువును మరో నెలరోజుల పాటు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయానికి ఉత్తర్వులందాయి. జిల్లా తొలి విడతగా 12 మండలాల్లో ఈ సర్వే కార్యక్రమం జరిగింది. రెండవ విడతలో మరో 20 మండలాలు, మూడవ విడతలో 14 మండలాలల్లో సర్వే చేపట్టారు. ఈ సర్వే కార్యక్రమం డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే సాంకేతిక కారణాల వలన నిర్ణయించిన సమయానికి కొన్ని మండలాల్లో సర్వే కార్యక్రమం పూర్తి చేయలేకపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో సర్వే పూర్తి చేసేందుకు మరో నెల రోజుల గడువు పొడిగించక తప్పలేదు.

దేహదానం చేయండి!

పినాకిని దేహ సమర్పకుల సంస్థ నారాయణ వైద్యకళాశాలలో దేహ సమర్పణ సదస్సు నిర్వహించింది. పినాకిని సలహా సంఘసభ్యులు డాక్టర్ జి.విజయకుమార్ మాట్లాడుతూ శరీర నిర్మాణశాస్త్రం వైద్యశాస్త్రానికి వెన్నెముక వంటిది; పేదల శరీరాలను కోసి శరీర నిర్మాణాన్ని నేర్చుకొన్న విషయాన్ని వైద్యులైన తర్వాత మరచిపోగూడదు. మృతదేహాన్ని వ్యర్థం చేయకుండా వైద్యకళాశాలకిచ్చి శరీర నిర్మాణ శాస్త్ర విభాగానికి తోడ్పడం ఎంతైనా అవసరమంటూ ఆ శాస్త్ర అభివృద్ధి చరిత్రను ప్రస్తావించారు. పినాకిని సంస్థ నిర్వాహకుడు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి సంస్థ ఏర్పాటుకు దారి తీసిన చారిత్రక నేపథ్యాన్ని తెలిపి, సంస్థ ఉద్దేశాన్ని సంస్థ సేకరించిన దేహాల గూర్చి పేర్కొని, వైద్య విద్యాభ్యాసకుల్లో సమాజం పట్ల కృతజ్ఞతాభావాన్ని పెంపొందించే ఆలోచనతో, తొలిసారిగా సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డాక్టర్ మేకల వెంకటరమణయ్య, నారాయణ వైద్యసంస్థల నిర్దేశకులు ఆచార్య జి.సుబ్రహ్మణ్యం, శరీరనిర్మాణ శాస్త్ర విభాగాధిపతులు ఆచార్య పుట్టగుంట బాపూజీ తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో సంబరాలు చేసుకొంటున్న యువత.



రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడానికి నెల్లూరులో జరిగిన పోలింగ్‌లో ఓటు వేస్తున్న న్యాయవాదులు.



జాతీయ రహదారిపై వాహనాలను దోచుకొంటున్న ముఠాను పట్టుకొన్న సందర్భంగా ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బి.వి.రమణకుమార్.

ఇల్లు తగలబెడతారా?

5వ పేజీ కొరవ

తాడు. వేరొకరికి అవకాశం ఇవ్వడు. రెడ్‌క్రాస్ అంటే తన స్వంతం అన్నట్లు ప్రవర్తిస్తాడు. అది, ఆ సంస్థతో అనుబంధితులైన వారికి సహజంగానే ఒళ్లు మంట కల్గిస్తున్నది. ఆ వ్యక్తిపై ద్వేషం చివరి కొచ్చేసరికి అసలు సంస్థపైనే అక్కసుగా మారిపో యింది. దాని ఫలితమే, బ్లడ్ బ్యాంక్ మూత.

హసీనాకు అన్యాయమే జరిగింది

ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ప్రసవం కోసం చేరిన పందొమ్మిదేళ్ల గర్భిణీ స్త్రీకి రెడ్‌క్రాస్ నుంచి తెప్పించిన రక్తం ఎక్కించారు. అక్కడ నుంచి ఆమెకు పలు రకాల ఆరోగ్య సమస్యలు వచ్చాయి. అనుమానం వచ్చి, రెండు నెలల తర్వాత పరీక్షలు చేయిస్తే, ఆమెకు ప్రాణాంతకమైన హెచ్‌ఐవి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. ఆ పరిణామంతో ఆ యువతి బంధువులు ఆగ్రహంతో రగిలిపోయారు. బ్లడ్ బ్యాంక్ పొరపాటు వల్ల ఒక యువతి జీవితం నాశనం కావడం ఘోరమైన అపరాధం. క్షమించ రాని నేరం. అందుకు ఎవరు బాధ్యులైనా, ఏ కారణం అందుకు ప్రేరణ అయినా కఠినమైన చర్యలు తీసు కోవడం, బాధ్యులను శిక్షించడం తప్పనిసరి. అం దులో ఎవరికీ రెండు రకాల అభిప్రాయాలు వుండ వలసిన అవసరం లేదు. అయితే కలెక్టర్ శ్రీధర్, బాధ్యులపైన చర్యలెట్లా అన్న కోణంలో కాకుండా, అసలు బ్లడ్ బ్యాంక్‌నే మూత వేయడానికి నిర్ణయం తీసుకొన్నారు.

విండో పీరియడ్‌లో తెలియదు

హెచ్‌ఐవి వైరస్‌కు విండో పీరియడ్ అనే లక్ష ణం వుంది. రోగి శరీరంలోకి ప్రవేశించిన కొంత కాలం తర్వాత కానీ అది రక్త పరీక్షలలో బయట పడదు. కొంతకాలం అనేది, ఆ రోగి రోగ నిరోధక శక్తి మీద ఆధారపడి వుంటుంది. రెండు మూడు నెలల కంటే ఎక్కువ కాలం విండో పీరియడ్ వుండ వచ్చు. రెడ్‌క్రాస్‌కు రక్తదానం చేసిన దాతలలో ఎవరైనా ఈ విండో పీరియడ్‌లో రక్తం ఇచ్చి వుంటే, అది పరీక్షలలో తేలే అవకాశం లేదు కాబట్టి, ప్రమాదవశాత్తు ఆ అభాగ్యురాలైన యువతి బలై పోయి వుండవచ్చు. ఇక్కడ చాలా ప్రశ్నలున్నాయి. బ్లడ్ బ్యాంక్‌లో రక్త పరీక్షలు ఎంతవరకు సక్రమం అనేది మొదటి ప్రశ్న. జరిగింది పొరపాటా, ప్రమా దమా, నిర్లక్ష్యమా అన్నది రెండవ ప్రశ్న.

లక్షల యూనిట్ల రక్తం సరఫరా చేసిన చరిత్ర!

నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో అత్యంత అధునాతన వైద్య పరికరాలు, యంత్రాలు వున్నాయి. రక్త పరీక్షలు పూర్తిగా యాంత్రికంగా, కంప్యూటర్ల సహాయంతో చేసే వసతి వుంది. చేసే ప్రతి పరీ క్షకూ కంప్యూటర్ రికార్డు వుంది. 1997లో బ్లడ్ బ్యాంక్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు రెండు లక్షలా డెబ్భై వేల యూనిట్ల రక్తం వివిధ ఆస్పత్రులకు సరఫరా చేశారు. ఇంతకాలం ఇటువంటి పొరపాటు లేదా నిర్లక్ష్యం ఎప్పుడూ జరి గిన దాఖలాలు లేవు. రాష్ట్రంలో ఈ స్థాయిలో రక్తం సరఫరా చేసిన సంస్థలు చాలా కొద్ది మాత్రమే వుంటాయి. అందువల్ల ఆ అభాగ్య యువతికి జరి గిన అన్యాయం పొరపాటే అవుతుంది తప్ప నిర్లక్ష్యం అనడానికి కారణాలు కన్పించడం లేదు.

మరోసారి పరీక్ష చేయించుకోవాలి!

బ్లడ్ బ్యాంకుల నుంచి రక్తం తీసుకొనే ఆస్ప త్రులు, దాన్ని రోగికి ఎక్కించే ముందు మరొకసారి పరీక్ష చేసుకోవడం అవసరం. కానీ ఈ విషయంలో అది జరగడం లేదు. రెడ్‌క్రాస్ రక్తం అంటే నాణ్య తకు చిహ్నం కాబట్టి, తాము మరొక పరీక్ష జరప లేదని ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు చెప్తున్నారు. వారు తమ స్థాయిలో పరీక్ష జరిపించుకొని వుంటే, ఒక వేళ రెడ్‌క్రాస్‌లో పొరపాటు జరిగినా, సరిదిద్దుకొనే అవకాశం వుండేది.

ప్లాస్మా ఎగుమతి చట్టబద్ధమా?

బ్లడ్ బ్యాంక్‌పై వచ్చిన మరొక ప్రధాన ఆరోపణ – రక్తాన్ని ప్లాస్మాగా మార్చి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారన్నది. రక్తాన్ని ప్లాస్మా, ఎర్ర కణాలు, ప్లేట్‌లెట్లుగా విడగొట్టి, ఆయా అవసరా లకు తగినట్లు రోగులకు సరఫరా చేయడం వైద్య శాస్త్రంలో ఒక ఆధునిక ప్రక్రియ. దీనివల్ల వున్న రక్తాన్ని ఎక్కువ మందికి అందించే వీలు కలుగు తుంది. పూర్తి రక్తాన్ని 21 నుంచి 35 రోజులకంటే ఎక్కువగా నిల్వ చేయలేరు. ప్లేట్ లెట్లను కేవలం 7 రోజుల లోపల వాడాలి. కానీ ప్లాస్మాను మాత్రం సరైన నిల్వ వసతి వుంటే ఐదేళ్ల వరకు దాచుకో వచ్చు. రెడ్‌క్రాస్‌లో ప్లాస్మాను నిల్వ చేయడానికి మైనస్ 80 డిగ్రీల శీతలం కల్గిన ఫ్రీజర్ వుంది. అయితే ప్లాస్మా వాడకం చాలా తక్కువ కాబట్టి, ఫ్రీజర్ నిండిపోయినప్పుడల్లా, మిగులు భాగాన్ని ఎగుమతి చేయడమో లేక అహ్మదాబాదులోని ఒక ప్రత్యేక మందుల కంపెనీకి ఇవ్వడమో చేస్తున్నామని చెప్తున్నారు బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు. ఇక్కడ రెండు ప్రశ్నలున్నాయి – ప్లాస్మా ఎగుమతి చట్ట విరుద్ధమా, సమ్మతమా అన్నది మొదటి ప్రశ్న. చట్ట విరుద్ధమైతే నేరుగా చర్య తీసుకోవచ్చు. లేదంటే, అది పెద్ద తప్పు కాదు. రెండవ ప్రశ్న – మిగులు వుంటే ప్రభుత్వ ఆస్పత్రులకు ఉచితంగా ఇవ్వవచ్చు కదా అన్నది. హైదరాబాదులోని కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులు తమ దగ్గరున్న మిగులు రక్త భాగాలను ప్రభుత్వ ఆస్పత్రులకు ఉచితంగా ఇస్తున్నాయి. ఇక్కడ అది ఎందుకు జరగడం లేదో సమాధానం చెప్ప వలసిన బాధ్యత రెడ్‌క్రాస్ నిర్వాహకుల మీద వుంది.

రక్తం ధరపై అసంతృప్తి!

రక్తానికి నిర్ణయించిన ధర మీద కూడా బ్లడ్ బ్యాంక్‌పై ఆరోపణలున్నాయి. ఇక్కడ రక్తం తీసుకొనే వారి నుంచి యూనిట్‌కు 800 రూపాయలు వసూలు చేస్తున్నారు. ఇది జాతీయ రెడ్‌క్రాస్ సంస్థ నిర్దేశించిన ధరకు అనుగుణంగానే వుంది. అయితే, తాము తీసుకొన్న రక్తానికి ప్రత్యామ్నాయంగా మరొకదాత ద్వారా కొత్త రక్తం ఇప్పిస్తే అందులో 400 రూపాయలు తిరిగి చెల్లిస్తున్నారు. రెడ్‌క్రాస్ రక్తం కొనదు. కేవలం దాతల నుంచి మాత్రమే తీసుకొంటుంది. ఆ రక్తానికి జరిపే పరీక్షల ఖర్చు కోసమే ఈ ధర. అయితే రెడ్‌క్రాస్‌కు కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి రక్త పరీక్షల కిట్లు ఉచితంగా అందుతున్నాయి. అది ఒక్కొక్కటి 150 రూపాయల వరకు వుంటుందట. అవి ఉచితంగా వచ్చినప్పుడు అంత మేర ధర తగ్గించాలి కదా అనేది ప్రశ్న. పూర్తిగా వ్యాపార పరంగా నడిచే నారాయణ ఆస్ప త్రిలో 650 రూపాయలకు రక్తం ఇస్తున్నప్పుడు, రెడ్ క్రాస్ 800 తీసుకోవడం ఏమిటనేది రెండవ ప్రశ్న. దీనికి సమాధానం రెడ్‌క్రాస్ నిర్వాహకులే చెప్పాలి. అయితే, రెడ్‌క్రాస్ సంస్థ ప్రభుత్వ ఆస్పత్రులకు, జయభారత్ ఆస్పత్రిలో చేరే గిరిజనులకు, తలసే మియా వంటి నిత్య రక్త మార్పిడి అవసరమైన రోగు లకు ఉచితంగా రక్త సరఫరా చేస్తున్నది. దాని ధర నిర్ణయంలో ఈ అంశాన్ని కూడా పరిగణనకు తీసు కోవడం అవసరం.

పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణ నివేదిక

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఈ వివాదంపై ఒక నిజ నిర్ధారణ నివేదిక తయారు చేసింది. అయితే వారు కూడా యాజమాన్యపర మైన ఆరోపణలు తప్ప సాంకేతికంగా రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు తప్పులు చేస్తున్నట్లు చెప్పడం లేదు. రక్త మార్పిడి ద్వారా హెచ్‌ఐవి వైరస్ సోకడం యాదృ చ్ఛికమే అని వారు కూడా అభిప్రాయపడుతున్నారు. ఇటువంటి సంఘటనలు అన్ని దేశాలలో జరుగు తున్నాయని చెప్తున్నారు.

రక్తం కోసం నానాపాట్లు

మొత్తం మీద చూస్తే, ఆ అభాగ్యురాలైన యువతికి జరిగిన నష్టం పూడ్చలేనిదే అయినా, దాని నెపంతో మొత్తం బ్లడ్ బ్యాంక్‌ను మూత వేయడం మాత్రం కలెక్టర్ గారు తీసుకొన్న తొందరపాటు చర్య అని చెప్పక తప్పదు. జరిగిన తప్పుకు పరిహారం, యాజమాన్యం మార్పిడి, నిర్వ హణ లోపాల సంస్కరణ వంటి చర్యలకు బదులు ఇంత తీవ్రమైన నిర్ణయం తీసుకొన్నారాయన. దాని వల్ల గత రెండు వారాలుగా రక్తం అవసరమైన వందలాది మంది రోగులు తీవ్ర సమస్య ఎదుర్కొం టున్నారు. కొన్ని ప్రాణాలు కూడా గాలిలో కలిసి పోయే ప్రమాదం ఏర్పడుతున్నది. ఇంత మొత్తంలో రక్తం సరఫరా చేయగలిగిన సంస్థ నెల్లూరులో మరొకటి లేదు.

కలెక్టర్ తొందరపాటు నిర్ణయం!

ఆ సూక్ష్మాన్ని గ్రహించకుండా రోగుల ప్రాణా లతో కలెక్టర్ గారు చెలగాటమాడినట్లు చెప్పక తప్ప దం లేదు. ఆరోపణలొస్తే రేషన్ షాపును మూసి నంత సులభంగా బ్లడ్ బ్యాంక్‌పై నిర్ణయం తీసు కొన్నారాయన.

ఇప్పటికైనా ఆయన తన తప్పు తెలుసుకొని, వెంటనే బ్లడ్ బ్యాంక్‌ను తెరిపించడం అవసరం. దాని నిర్వహణపై అజమాయిషీకి ప్రభుత్వ డాక్టర్లను నియమించే అధికారం ఆయన చేతులలో వుంది.

పెత్తనం కోసం వివేకా ప్రయత్నం

ఈ ఉదంతం వల్ల జరగబోతున్న మరొక అనర్థం – ఇంతకాలం రాజకీయాలకు, రాజకీయ వాదులకు దూరంగా వున్న రెడ్‌క్రాస్‌లో ప్రవేశించ డానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకా నందరెడ్డి ప్రయత్నం చేయడం. ఆయన ఆ సంస్థలో చేరితే అది ఎంతగా భ్రష్టుపట్టి పోతుందో చెప్పనే అవసరం లేదు. ఆ ప్రమాదాన్ని తప్పించే బాధ్యత కూడా కలెక్టర్ గారు తీసుకోవాలి.

కొమ్మనేటూరు యువతి

మొదటి పేజీ కొరవ

దన్న అనుమానాలు, వదంతులు వ్యాప్తిలోకి వస్తు న్నాయి.

ఆ యువతికి ఇటీవలనే పెళ్లి జరిగిందట. ఆ కాంగ్రెస్ ప్రముఖుడే ఆ పెళ్లి పెద్దగా వ్యవహరించా డట. అయితే ఆ యువతి చావు సమయంలో ఆమె భర్త మద్రాసు ఇంట్లో లేడు. ఈ కాంగ్రెస్ ప్రము ఖుడు మాత్రం ఉన్నాడు. ఇందులో అనుమానించ దగింది ఏదీ లేకుంటే ఆ అమ్మాయి శవాన్ని ఆమె తల్లితండ్రులు తమ గ్రామానికి తెచ్చి ఉండాలి. కానీ రహస్యంగా కొమ్మనేటూరుకు తరలించి అక్కడే కార్య క్రమాలు పూర్తి చేశారు.

కాంగ్రెస్ రాజకీయాలలో కీలకంగా వ్యవహ రిస్తున్న నేత ప్రమేయం ఉందన్న అనుమానం వల్ల ఈ అనుమానాస్పద చావుపై పలురకాల వదం తులు వస్తున్నాయి. పోలీస్ ఉన్నతాధికారులు దీనిపై విచారణ జరపడం మంచిది.

జగన్ అరెస్ట్ ఖాయం?

మొదటి పేజీ కొరవ

శమనం లభించలేదు. విజయసాయిరెడ్డిని జార్జియా అనే మాజీ సోవియట్ చీలిక దేశం దౌత్య అధి కారిగా నియమింపచేసి అరెస్ట్‌ను తప్పించే ప్రయత్నం చేశాడు. అదీ వికటించింది. అన్ని దారులూ మూసుక పోవడంతో ఇక తన అరెస్ట్ తప్పదన్న భయానికి వచ్చాడు జగన్.

అయితే సిబిఐ తదుపరి చర్యలు కేవలం జగన్ అరెస్ట్‌తో అగుతాయా లేక ఆయన ఆర్థిక, రాజకీయ మూలాలను శిథిలం చేసే దిశలో ఉం టాయా అన్నది ప్రశ్న. జగన్ అక్రమ ఆస్తుల కేసులో సాక్షి పత్రిక, టీవీ ఛానళ్ల పెట్టుబడులు కీలక అం శం. దాదాపు 1500 కోట్ల రూపాయల లావాదేవీ ఈ పద్దులోనే జరిగింది. నకిలీ కంపెనీలు, మారిషస్ నుంచి నిధుల తరలింపు, చట్టాలను ఉల్లఘించి సాక్షిలోకి విదేశీ పెట్టుబడులను దొంగ మార్గంలో తరలించడం వంటి తప్పులన్నీ ఉన్నాయి.. వాటి మీద సిబిఐ నిశితంగా దృష్టి సారిస్తే, సాక్షి పత్రిక, టీవీ ఛానళ్ల ఖాతాలను స్తంభింపచేసే అవకాశం ఉంది. అదే జరిగితే ఈ రెండూ మూతపడతాయి. కాంగ్రెస్‌కు ఇప్పుడు కావలసింది కూడా అదే. జగన్ తన పత్రిక, టీవీ ఛానళ్ల ద్వారా తన వాదనను ప్రజలలోకి విస్తృతంగా తీసుక వెళ్లగలుగుతున్నాడు. తనకు గిట్టని వారి మీద బురద చల్లగలుగుతు న్నాడు. ఇవి మూత పడితే ఆయన గొంతు మూగ పోతుంది. ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి పత్రికలతో ఆయనకున్న విరోధం దృష్ట్యా సాక్షి మూతపడితే ఇక జగన్ వార్తలే కన్పడవు ప్రజలకు. దాని వల్ల జరిగే రాజకీయ నష్టం అంతా ఇంతా కాదు.

ఏది ఏమైనా జగన్ చిక్కుల్లో పడినట్లే లెక్క. తాను జనం మధ్యలో ఉన్నంతకాలం సిబిఐ తన జోలికి రాకపోవచ్చునన్న అంచనా ఒకటి ఉంది జగన్‌లో. అందువల్లనే ఆయన ఒంగోలు విద్యార్థి పోరు దీక్ష నుంచి, ఒకరోజు ముందుగా గుంటూరు జిల్లాలో మూడవ దశ ఓదార్పు యాత్రకు బయలు దేరి వెళ్లాడు. అక్కడ నుంచి నల్గొండ జిల్లా గ్రామా లలో అడుగు పెట్టాలన్నది సంకల్పం. తాను తల పెట్టిన నిజామాబాద్ రైతు పోరు కార్యక్రమం లోపల సిబిఐ తనను అరెస్ట్ చేస్తే తాను తెలంగాణాలో తిరగకుండా పోయానన్న అపవాదు నిలిచి పోతుంది. ఒకసారి జైలుకు వెళ్తే 2014 ఎన్నికల లోగా బయ టకు వచ్చే అవకాశం ఉంటుందో లేదో తెలియదు. అందువల్ల తెలంగాణాలో తిరగలేదన్న అపవాదు తప్పించుకోవడానికి గుంటూరు ఓదార్పు యాత్రలోనే నల్గొండను కూడా కలపాలన్న నిర్ణయానికి వచ్చాడు.

థానే తుపాన్ నష్టాన్ని అంచనా వేయరా?

థానే తుపాన్ సందర్భంగా జిల్లాస్థాయి అధికారులను తీరప్రాంత మండలాల ప్రత్యేకాధికారులుగా నియమించి ప్రజలను అప్రమత్తం చేసిన జిల్లా కలెక్టర్ సంభవించిన నష్టాలపై కూడా సర్వే చేయించాలని రైతులు కోరుతున్నారు.



తుపాను ప్రకటన విని బోట్లు, వలలను భద్రపరచుకొన్న మత్స్యకారులు.

జిల్లాలో గత నెల చివరి వారంలో సంభవించిన థానే తుపాన్ ప్రభావంతో వ్యవసాయానికి కొంతమేర నష్టం వాటిల్లింది. జిల్లాలో ఇప్పటికే వ్యవసాయ నాట్లు కొన్ని ప్రాంతాల్లో వేయడం జరిగింది. మిగిలిన ప్రాంతాల్లో నాట్లు వేసేందుకు సిద్ధమౌతున్న సమయంలో బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. అనంతరం థానే తుపాన్‌గా మారిందని వాతావరణశాఖ ప్రకటించడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తుపాన్ ప్రభావం పెద్దగా లేకపోయినప్పటికి రెండురోజుల పాటు భారీవర్షాలు కురిశాయి.

దీంతో నాట్లు వేసేందుకు సిద్ధంగా వుంచిన నారుమళ్లలో అధికంగా వర్షపు నీరు చేరగా, నాట్లు వేసిన పొలాల్లోకి సైతం నీరు చేరి నీటమునిగాయి. నాట్లు నీట మునిగిన ప్రాంతాల్లో తిరిగి నారుమళ్లు పోసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వపరంగా వరి విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు. తీరప్రాంత మండలాలైన బోగోలు, అల్లూరు, విడవలూరు, చిల్లకూరు తదితర మండలాల్లో కొంతమేర వరినాట్లు, నారుమళ్లకు నష్టం జరిగింది. వ్యవసాయశాఖ అధికారులు జరిగిన నష్టాలను అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఇదిలా వుండగా మెట్టప్రాంతాల్లో వేసిన వేరుశనగ, మినుము తదితర పంటలకు కూడా నష్టం వాటిల్లింది. థానే తుపాన్‌తో వర్షాలు పడడంతో మెట్టప్రాంతాల్లోని పొలాల్లో నీరు నిల్వ చేరింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కావలి మండలంలోని తాళ్లపాళెం గ్రామంలో అధికంగా వేరుశనగ పంట వేయడం జరిగింది. సమీపంలో నున్న కాల్వల ద్వారా వర్షపునీరు పొంగిపొర్లి పంట వేసిన పొలాల్లోకి చేరింది. పొలాల్లోకి చేరిన వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. థానే తుపాన్ కారణంగా నష్టపోయిన పంటలను అధికారులు ఇప్పటివరకు పరిశీలన చేయలేదు.

జిల్లాస్థాయి అధికారులను తీరప్రాంత మండలాల ప్రత్యేకాధికారులుగా నియమించి ప్రజలను అప్రమత్తం చేసినా జిల్లా కలెక్టర్ సంభవించిన నష్టాలపై కూడా సర్వే చేయించాలని రైతులు కోరుతున్నారు. తుపాన్ వెళ్లి వారం రోజులు గడిచినప్పటికి సంబంధితశాఖ అధికారులు జరిగిన నష్టాలపై దృష్టి సారించకపోవడం విశేషం. పెద్దగా నష్టాలు జరగలేదన్న విధంగా వ్యాఖ్యానిస్తున్నారు. మరోప్రక్క తుపాన్ సమయంలో చలిగాలులు తట్టుకోలేక ఏడుమంది మరణించారు. వీరి కుటుంబసభ్యులు ప్రభుత్వపరంగా అందించే సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో తుపాన్ నష్టం ఏమేరకు వాటిల్లిందన్న విషయాన్ని అధికారులు స్పష్టం చేయలేకపోతున్నారంటే ఎంత పారదర్శకంగా విధులు నిర్వహిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తుపాన్ కారణంగా దెబ్బతిన్న పంటలపై సర్వే నిర్వహించి రైతులకు ప్రభుత్వపరంగా సహాయం అందించాల్సిన అవసరం వుంది.

మనీ సర్క్యులేషన్ స్కీంలో సొమ్ము బొక్కేసిన పోలీసులు!

మని సర్క్యులేషన్ స్కీం పేరిట ప్రజల నుంచి వివిధ సంస్థలు వసూలు చేసిన నగదుపై సిఐడి అధికారులు ఒకవైపు విచారణ జరుపుతుండగా, మరోవైపు కొందరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఏజెంట్లను బెదిరించి లక్షలు స్వాహా చేయడం గగ్గోలు రేపుతోంది. దీనిపై సిఐడి అధికారులు చర్యలు తీసుకోక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

కంచే చేనుమేసిన చందంగా వుంది మనీస్కీం వ్యవహారంలో పోలీసుల పాత్ర. ఒకవైపు ఈ స్కీంలను ఏర్పాటు చేసి ప్రజల నుంచి పెద్దఎత్తున నగదును కట్టించుకొని మోసగించిన సూత్రధారులు, నిర్వాహకులపై సిఐడి అధికారులు విచారణ జరుపుతుంటే మరోవైపు పోలీసులు ఏజెంట్లను అదిరించి బెదిరించి డబ్బులు దిగమింగడం గగ్గోలు రేపుతోంది. మనీస్కీం పేరిట పేద, మధ్యతరగతి ప్రజల నుంచి లక్షలాది రూపాయలు స్వాహా చేసిన వారిని పట్టుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూడాల్సిన పోలీసులే అందినంత బొక్కేయడం అధికారుల అవినీతిని నగ్నంగా బయట పెడుతోంది. జిల్లాలో పెద్ద ఎత్తున వివిధ సంస్థలు ఏర్పాటై పలురకాల పేర్లతో ఒకటికి ఐదింతలు ఆశ చూపి కోట్లాది రూపాయలు మనీస్కీంలో కట్టించుకోవడం తెలిసిందే. దీనిపై జిల్లా ఎస్పీ ముందుగానే నిఘా పెట్టి ఎక్కడికక్కడ సంస్థల నిర్వాహకులు, ఏజంట్లపై దాడుల చేయించి, బ్యాంకు ఖాతాల్లోని నగదును సీజ్ చేయడంతోపాటు వివిధ ప్రాంతాలకు తరలిస్తుండిన డబ్బును పట్టుకొన్నారు. అంతవరకు బాగానే వున్నా పంచుతున్న డబ్బులను పట్టుకొనే విషయంలో కొందరు పోలీసులు అవకతవకలకు పాల్పడ్డారు. వెంకటాచలంలో పట్టుకొన్న నగదులో కానిస్టేబుల్ విజయకుమార్ పెద్ద మొత్తంలో డబ్బు సంచిని కాజేశాడని ఫిర్యాదు రావడంతో ఎస్పీ విచారణకు ఆదేశించడం జరిగింది. ఆ తర్వాత ఈ కేసు తీవ్రతను గమనించిన డిజిపి దినేష్ రెడ్డి మనీస్కీం వ్యవహారమై లోతైన దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేసేందుకు సిబిసిఐడికి కేసు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. సమర్థుడైన అధికారిగా పేరున్న డిఎస్పీ విజయకుమార్ కేసు దర్యాప్తు చేపట్టిన అనతికాలంలోనే హిమ్ సంస్థ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్‌తోపాటు నేహామియా తదితరులను అరెస్టు చేసి పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకొన్నారు. అంతవరకు బాగానే వున్నా సిఐడి దర్యాప్తు జరుగుతున్నా జిల్లాలో పలువురు సిఐలు ఏజెంట్లు, నిర్వాహకుల నుంచి లక్షల రూపాయలు సొమ్ము స్వాహా చేయడం బట్టబయలైంది. దీనికి సంబంధించి పలువురు అధికారుల పాత్రపై ఆధారాలు దొరికినా వారిపై చర్యలు తీసుకోవడంలో సిఐడి అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులే అవినీతి సొమ్ముకు కక్కుర్తిపడి లక్షలు దిగమింగడం, వారి నుంచి ఆ సొమ్ము రాబట్టి చర్యలు చేపట్టడంలో సిఐడి అధికారులు మౌనం వహిస్తుండడం పట్ల సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మనీస్కీంలో అధికమొత్తంలో డబ్బులు కట్టి నష్టపోయిన బాధితులు సిఐడి అధికారులు తమకు న్యాయం చేస్తారని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న తరుణంలో పోలీసు అధికారులే అందినంత దిగమింగడంతో ఇక తమ డబ్బులు ఎంతవరకు వస్తాయి? అధికారులు ఏ మేరకు నిష్పక్షిపాతంగా వ్యవహిస్తారు అనే దానిపై సందేహం వ్యక్తం చేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొనైనా సిఐడి అధికారులు డబ్బులు స్వాహాచేసిన అధికారులపై చర్యలు చేపట్టి నిజాయితీ నిరూపించుకోవాల్సి ఉంది.

జిల్లా రైతు
పాగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190



Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

కోవూరు కాంగ్రెస్ అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి!



కోవూరు ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు దాదాపు ఖరారై పోయింది. అధికారిక ప్రకటన ఇక లాంఛనం మాత్రమే. 3వ తేది సాయంత్రం ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి జిల్లా ముఖ్యులందరినీ పిలిపించి మాట్లాడాడు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆనం వివేకానందరెడ్డి, మాజీ మంత్రిణి నేదురుమల్లి రాజ్యలక్ష్మి, కాంగ్రెస్‌లోకి పునఃప్రవేశించిన అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి ఈ సమావేశానికి హాజరైనారు. పిసిసి అధ్యక్షుడు బొత్సా, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పితాని సత్యనారాయణ కూడా వచ్చారు. అయితే అందరూ కూర్చున్న సమావేశంలో ఎవరూ నోరు విప్పి ఎవరి పేరూ చెప్పక పోవడంతో ముఖ్యమంత్రి ఒక్కొక్కరినీ తన గదిలోకి పిలిపించి అభిప్రాయాలు అడిగాడట. ఆ ఆంతరంగిక సంభాషణలో అధిక శాతం పోలంరెడ్డి పేరే చెప్పారట.

దాదాపు ఏడాదిన్నరగా కోవూరు పట్టు సంపాదించాలనే తాపత్రయంతో జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రయత్నిస్తున్నాడు. ఉప ఎన్నిక ఏ రోజైనా తప్పదు కాబట్టి అది తన చేతుల మీదుగా జరగాలని తపన పడ్డాడు. అందుకోసం నారాయణ మెడికల్ కాలేజిలో సిఇఓ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని అనధికార ఇన్‌ఛార్జ్‌గా నియమించాడు. ఎమ్మార్వో, పోలీస్, పంచాయితీరాజ్ విభాగాలకు సంబంధించిన పనులన్నీ పట్టాభి ద్వారానే జరిపించాడు. కాంగ్రెస్ సమావేశాలలో పెద్ద పీట వేశాడు. అది చూసి ఉప ఎన్నికలలో ఆనం వారి అభ్యర్థిగా పట్టాభి ఉంటాడని అందరూ భావించారు. మొన్న సాయంత్రం ముఖ్యమంత్రి దగ్గర జరిగే సమావేశానికి కూడా పట్టాభిని తమ వెంట తీసుకొని వచ్చారు. కానీ లోపలకు వెళ్లేసరికి ప్లేట్ ఫిరాయించారు. ఆనం వారి అవకాశవాద రాజకీయాలు ఎట్లా ఉంటాయో పట్టాభికి, కోవూరు కాంగ్రెస్‌వాదులకు ప్రత్యక్షంగా రుచి చూపించారు.

ఎన్నికలలో తమ ఛాయిస్ పోలంరెడ్డి అనుకొన్నప్పుడు పట్టాభికి అన్ని ఆశలు కల్పించడం ఎందుకు? నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను రెండు వర్గాలుగా చీల్చి, చిందరవందర చేయడం ఎందుకు? వారి ఉద్దేశం ఈ ఎన్నికలలో పార్టీ గెలవాలనా లేక పతనం కావాలనా?

ఈ అపభ్రంశపు రాజకీయం వల్ల ఇప్పుడు కోవూరులో కాంగ్రెస్ పరిస్థితి అధ్వానంగా తయారైంది. దాన్ని చక్కదిద్దుకొనేసరికి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి తల ప్రాణం తోకకు రావడం ఖాయం. ముఖ్యమంత్రి మాత్రం జిల్లాలోని కాంగ్రెస్‌వాదులందరూ కలిసి ఎట్లైనా కాంగ్రెస్‌ను గెలిపించాలని, సర్వే నివేదికలు కూడా అనుకూలంగా ఉన్నాయని ఉద్బోధించాడట. అందరూ ఒక మాట మీద నడిస్తే ఆ ప్రయత్నం ఎంతో కొంత సఫలం అవుతుంది. కానీ ఆనం సోదరుల ఆంతర్యం అక్కడ గెలుపో, కాదో తేలితే తప్ప ఈ ప్రయత్నం సఫలమో, విఫలమో ఊహించలేము.







Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com